PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 30 | విజయవాడ, ఆదివారం 31 ఆగస్టు 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 31 August 2025 | Rs

ఎస్‌టి కమిషన్ ఆదేశాలు భేఖాతర్

- కరేడులో ఆగని భూ సేకరణ ప్రక్రియ
- గిరిజనుల ఆగ్రహంతో వెనుతిరిగిన అధికారులు

2

తెలుగు టైటాన్స్‌కు మళ్లీ నిరాశ

- యుపి యోధాస్‌పై పోరాడినా ఓటమే..

8

రాయలసీమను అగ్రసీమ చేస్తాం

కుప్పానికి ఇప్పుడు నీళ్లొచ్చాయి.... వచ్చే ఏడాది చిత్తూరుకూ ఇస్తాం

- బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'పరమసముద్రం'లో జలహారతి

జలహారతి అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

రాయలసీమను అగ్రసీమగా అభివృద్ధి చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కుప్పం నియోజకవర్గం పరమసముద్రం గ్రామంలో హంద్రీనీవా బ్రాంచి కెనాల్ వద్ద కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి శనివారం జలహారతి ఇచ్చారు. హంద్రీనీవా కాల్వ విస్తరణ పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆరు పరిశ్రమలకు సంబంధించి ఎంఒయులు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయలు ఏలిన కాలంలో రతనాల సీమగా ఉన్న ఈ ప్రాంతం వరుస కరువుతో రాళ్లసీమగా మారిందన్నారు. తమ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి కృతనిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. దీనికోసం బ్లూప్రింట్ సిద్ధంగా ఉందని తెలిపారు. కర్నూలు జిల్లా మన్యాల నుంచి 738 కిలోమీటర్లు దూరం కృష్ణా జలాలను తీసుకొచ్చామన్నారు. రాయలసీవమకు ఇప్పటివరకూ 12 పరిశ్రమలు వచ్చాయని, రూ.3,908 కోట్ల పెట్టుబడులు పెట్టారని, 15,600 మందికి ఉద్యోగాలు, 26,581 మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని తెలిపారు. 2024 ఎన్నికల్లో సీమ ప్రజలు వైసిపికి ఏడు సీట్లకే సరిపెట్టారని, తమను ఆదరించిన సీమ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా టిడిపి కూటమి ప్రభుత్వం కంకణబద్ధమై ఉందన్నారు. రాయలసీమలో ఇరిగేషన్, హార్టికల్చర్, అగ్రికల్చర్, పరిశ్రమలకు పెద్దపీట వేస్తూ అగ్రసీమగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఒకప్పుడు రాయలసీమలో కరువు వస్తే పశువుల కోసం రైళ్లలో నీళ్ల తెప్పించి కాపాడుకున్నామని, తాను ఏ పనిచేయాలన్నా వెంకన్నపై భారం వేసి బుల్లెట్‌లా దూసుకెళతానని, పవిత్రమైన సంకల్పం ఉంటే జయప్రదమవుతుందని అన్నారు. 2014-19లో రాయలసీమ ప్రాజెక్టులకు 12,500 కోట్లు ఖర్చు చేశామని, వైసిపి పాలనలో కేవలం రెండు వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. గేతంలో గట్లతో సెట్టింగ్ వేసి నీళ్ల కూడా బయట నుంచి తీసుకొచ్చి నాటకాలాడిన ఘటనలు, విమానం ఎక్కేలోపే నీళ్లన్నీ ఇంకిపోయిన పరిస్థితులను చూశామని అన్నారు. అసత్యాలు చెప్పడంలో వైసిపి దిట్టని విమర్శించారు. ప్రతి చెరువుకూ నీళ్లిచ్చే బాధ్యత తనదని, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో 110 చెరువులకు నీళ్లిచ్చే అవకాశం ఉందని అన్నారు. హంద్రీనీవా ఫేజ్-1, ఫేజ్-2 వల్ల ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుందని, 33 లక్షల మందికి తాగునీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరిశ్రమలకూ నీళ్లిస్తామన్నారు. కర్నూలులో కృష్ణగిరి, పత్తికొండ రిజర్వాయర్లకు, అనంతపురంలో జీడిపల్లి రిజర్వాయర్‌కు, పెన్నాఅహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నాలుగు టిఎంసిల నీళ్ల నింపామన్నారు. ఇవాళ కుప్పానికి నీళ్లొచ్చాయని, రాబోయే ఏడాదికి హంద్రీనీవా ద్వారా చిత్తూరుకూ నీళ్లిచ్చే బాధ్యత తనదని ప్రకటించారు. పోలవరం, బనకచర్ల పూర్తయి వంశధార నుంచి మిగతా 7లో

18 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

- 14, 15న తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ల సమావేశం
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - నర్సీపట్నం (అనకాపల్లి)

సెప్టెంబరు 18 నుంచి వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం ఆయన మీడియాకు ఓ వీడియో ద్వారా తన నియోజకవర్గమైన నర్సీపట్నంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలిపారు. 14, 15 తేదీల్లో తిరుపతిలో మహిళా పార్లమెంటేరియన్ సమావేశం జరగనుందని, దేశంలోని అన్ని రాష్ట్రాల మహిళా శాసన సభ్యులు సహా సుమారు 300 మంది హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇతర విషయాలపైనా మాట్లాడారు. మహిళా పార్లమెంటేరియన్ సమావేశాన్ని 14న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. 15న ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని చెప్పారు.

యూరియా సరఫరా అరకొరే!

- రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల ధర్నా

3

అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం వడ్డిగూడెం నుంచి సురక్షిత ప్రాంతాలకు ట్రాక్టర్‌పై వెళ్లిపోతున్న ముంపు బాధితులు

వరద గోదావరి

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికకు చేరువగా
- భయం గుప్పిట్లో పోలవరం ముంపు, లంక గ్రామాల ప్రజలు
- సురక్షిత ప్రాంతాలకు పయనం

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు తోడు గోదావరి బేసిన్లో ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తుండడంతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద వరద నీరు రెండో ప్రమాద హెచ్చరికకు చేరువగా ప్రవాహిస్తోంది. వరద అంతకంతకూ పెరుగుతుండడంతో పోలవరం ముంపు గ్రామాలు, లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. అల్లూరి జిల్లా విఆర్.పురం మండలంలోని పలు గ్రామాల్లోకి నీరు చేరింది. కొందరు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. తెలంగాణలోని సింగూరు ప్రాజెక్టు, నిజాంసాగర్, ఎస్సారెస్పి, ఎల్లంపల్లి, మేడిగడ్డ, దుమ్ముగూడెం ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో శనివారం రాత్రి తొమ్మిది గంటలకు భద్రాచలం వద్ద నీటిమట్టం 47.70 అడుగులకు చేరుకుంది. 11.30 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని అధికారుల అంచనా. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గోదావరి ఉధృతి పెరుగుతుండడం తో అల్లూరి జిల్లాలోని విఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల్లోని ముంపు గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఎటపాక మండలం మురుమూరు వద్ద భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ-మురుమూరు, నెల్లిపాక-వీరాయిగూడెం గ్రామాల మధ్య రహదారులపైకి వరద నీరు చేరడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. పది రోజుల వ్యవధిలో రెండోసారి గోదావరి తమ గ్రామాలను చుట్టుముట్టిందని, రాకపోకలు నిలిచిపోయాయని వీరాయిగూడెం, మురుమూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసరాలు అందజేయాలని అధికారులను కోరుతున్నారు.

విఆర్.పురం మండలం వడ్డిగూడెం మిగతా 7లో

ఏడేళ్ళ తర్వాత చైనా గడ్డపై!

- నేడు ఎస్‌సిఓ సదస్సుకు ప్రధాని మోడీ
- చైనా అధ్యక్షుడితో భేటీ

తియాన్‌జిన్‌లోని బిన్‌హాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న చైనా, భారత్ అధికారులు

తియాన్‌జిన్ : ఏడేళ్ళ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ చైనా గడ్డపై శనివారం కాలు మోపారు. 2018 జూన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) సదస్సు కోసం ప్రధాని చైనాలో పర్యటించారు. ఈసారి అదే సదస్సు కోసం ఉత్తర చైనా ఓడరేవు నగరమైన తియాన్‌జిన్ చేరుకున్నారు. తియాన్‌జిన్‌కు చేరుకోగానే అక్కడి భారతీయులు ప్రధానికి ఘనంగా స్వాగతం పలికారు. బిన్‌హాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన వెంటనే ప్రధానికి, చైనా, భారత్ సీనియర్ అధికారులు స్వాగతం పలికారు. ఎస్‌సిఓ సదస్సులో చర్చల కోసం, వివిధ ప్రపంచనేతలను కలుసుకోవడం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అంటూ మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

టారిఫ్‌లపై అమెరికా అనుసరిస్తున్న విధానాల నేపథ్యంలో ప్రధాని చైనా పర్యటన అత్యధిక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆదివారం, సోమవారం జరగనున్న ఎస్‌సిఓ వార్షిక సదస్సుకు హాజరయ్యేందుకే మోడీ వచ్చారు. అయితే ఆదివారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరపబోయే సమావేశం మరింత ప్రాధాన్యంగా మారింది.

ఈ చర్చల సందర్భంగా భారత్, చైనాల మధ్య ఆర్థిక సంబంధాలను ఇరువురు నేతలు సమీక్షిస్తారని భావిస్తున్నారు. షాంఘై సదస్సును పురస్కరించుకుని రష్యా అధ్యక్షుడు మిగతా 7లో

ప్రమాదంలో పంటల బీమా

- ఇన్సూరెన్స్ స్వచ్ఛందమన్న కేంద్ర ప్రభుత్వం
- ఉచితం ఎత్తేసి రైతులపై ప్రీమియం భారం మోపిన కూటమి సర్కార్
- విపత్తు నష్టాలకు చిన్నిపాటి ఆసరా దక్కని విపత్కరం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పంటల బీమాకు ప్రమాదం ముంచుకొచ్చింది. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతులకు ఆసరా కావాల్సిన బీమా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా కొడి కడుతోంది. మోడీ ప్రభుత్వం పంటల బీమాను రైతుల ఇష్టా ఇష్టాలకు వదిలేస్తూ నిబంధనల్లో మార్పులు చేయగా, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అప్పటి వరకు అమలవుతున్న ఉచిత పంటల బీమాను ఎత్తేసి రైతుల వాటా ప్రీమియాన్ని రైతులే కట్టుకోవాలని షరతు విధించింది. 'డబుల్ ఇంజిన్ సర్కార్' డబుల్ ధమాకాతో అన్నదతలకు బీమాపై ఉన్న కాస్తంత ధీమా సైతం లేకుండా పోయింది. ఈ ఖరీఫ్‌లో పంటలకు బీమా చేయించుకునే రైతుల సంఖ్య, సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఖరీఫ్ మరో నెలలో ముగుస్తుండగా ఆగస్టు చివరాఖరికి బీమా పరిధిలోకొచ్చిన రైతులు, విస్తీర్ణంలో నెలకొన్న క్షీణత ఆందోళన కలిగిస్తోంది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో కొన్నాళ్లు వర్షాభావం పీడించగా, ఇప్పుడు అతి భారీ, భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. సరిగ్గా ఇప్పుడే పంటల బీమా గ్రాఫ్ పడిపోయింది.

అటు మోడీ సర్కార్

కేంద్ర ప్రభుత్వం బీమా పథకాలను రైతుల ఇష్టాఇష్టాలకు వదిలి పెట్టింది. గతంలో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకు తప్పనిసరి బీమా ఉండేది. బ్యాంక్ లోన్లు పొందని రైతులకు ఆప్షనల్ (ఐచ్ఛికం) అన్న నిబంధన ఉంది. మోడీ ప్రభుత్వం ఎవ్వరికైనా బీమా స్వచ్ఛందమనడంతో రైతుల నుంచి తమకు బీమా వద్దన్నట్లు సంతకాలు తీసుకుంటు న్నాయి. కాగా గత వైసిపి ప్రభుత్వం తొలుత తానే ఇన్సూరెన్స్ నిర్వహించింది. కేంద్రం ఒత్తిడితో 2022 ఖరీఫ్ నుంచి కేంద్ర పథకాలైన ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమాలో చేరింది.

కంపెనీలను తిరిగి ప్రవేశపెట్టింది. అయితే రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తానంది. దాంతో రైతులు బీమా వైపు అడుగులేశారు. కానీ ప్రభుత్వం తన వాటా నిధులను సరిగ్గా మిగతా 7లో

ఖరీఫ్ పంటల బీమా తీరు

సంవత్సరం	రైతులు		విస్తీర్ణం	
	ఫసల్	వెదర్	ఫసల్	వెదర్
2022	25.28	లేదు	50.90	లేదు
2023	22.68	7.40	48.82	17.95
2024	24.05	8.00	51.55	19.17
2025	4.02	2.95	7.55	10.85

- రైతులు లక్షల్లో
- విసీర్ణం లక్షల ఎకరాలు
- 2025 లెక్కలు ఆగస్టు 30 వరకు

తెలుగు అకాడమీ చైర్మన్‌గా ఆర్‌డి విల్సన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్‌గా ఆర్‌డి విల్సన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 156ను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ శనివారం విడుదల చేశారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారని పేర్కొన్నారు. నెల్లూరు నియోజకవర్గానికి చెందిన విల్సన్ ప్రస్తుతం బిజెపి నాయకులుగా ఉన్నారు.

కేరళ సిఎం విజయన్‌పై అభ్యంతరకర పోస్టు

- నిందితుడు అరెస్టు

7

పోలవరం డ్యామ్ డిజైన్లకు ఆమోదం

- సిడబ్ల్యుసి అనుమతికి సిఫార్సు
- నేడు డీప్ సాయిల్ మిక్సింగ్‌పై సమావేశం
- గ్యాప్-2 డిజైన్లపై చర్చ

3

ఇఒఐలకు టిడిపి సమర్థన

- 'ఉక్కు' సింగిల్ విండో కాంట్రాక్టర్ విధానానికి తాము వ్యతిరేకం కాదని పల్లా ప్రకటన
- కార్మిక సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ)లను టిడిపి సమర్థించింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేపడుతున్న సింగిల్ విండో కాంట్రాక్టర్ విధానానికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మద్దతు తెలిపారు. దీంతో, స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వ కుట్రలో రాష్ట్ర ప్రభుత్వం, టిడిపి భాగస్వామ్యమైనట్లు వెల్లడైంది. గాజువాకలోని టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌లో గతంలో వెయ్యి మంది కాంట్రాక్టర్లు ఉండేవారని, ప్లాంట్‌పై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రస్తుతం సుమారు 42 విభాగాల్లో ఇఒఐలను పిలిచారని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో 42 మంది కాంట్రాక్టర్లు మాత్రమే ఉండేలా ప్లాంట్‌లో చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఏ కాంట్రాక్టర్ అయినా పాత కాంట్రాక్టు కార్మికులను తప్పనిసరిగా కొనసాగించాలనే నిబంధన పాటించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పుకొచ్చారు. సమావేశంలో టిడిపి కూటమి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పల్లా వ్యాఖ్యలు దారుణం

ప్లాంట్ ప్రైవేటీకరణకు ఉద్దేశించిన ఇఒఐలను పల్లా సమర్థించడంపై ఉక్కు కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కర్మాగారంలోని విభాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుకూల కాంట్రాక్టర్లకు అప్పగించి, తదుపరి ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసే కుట్ర సాగుతోందన్నారు. ఉక్కులో ఇఒఐలు, ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలకు వ్యతిరేకంగా ఆదివారం ఉదయం నుంచి కూర్మన్నపాలెం కూడలిలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

యుపిఐ సేవల్లోకి బిఎస్‌ఎన్‌ఎల్

న్యూఢిల్లీ : ప్రభుత్వ టెల్కో భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్‌ఎన్‌ఎల్) కొత్తగా డిజిటల్ చెల్లింపుల్లోకి ప్రవేశించ డానికి కసరత్తు చేస్తోంది. వచ్చే దీపావళి కల్లా యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) సేవలను ప్రారంభించే పనిలో ఉంది. బిఎస్‌ఎన్‌ఎల్ పే పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ (భీమ్) యుపిఐ ఆధారంగా బిఎస్‌ఎన్‌ఎల్ పే సేవలను వినియోగించుకునేలా ఈ యాప్‌ను రూపొందిస్తోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఆర్థిక లావేదేవీలు, బిల్లుల చెల్లింపుల కోసం ఫోన్‌పే, గూగుల్ పే, పేటియం లాంటి ప్రయివేటు డిజిటల్ యాప్‌లకు ధీటుగా బిఎస్‌ఎన్‌ఎల్ పే సేవలను వినియోగంలోకి తేవాలని నిర్దేశించుకుంది. బిఎస్‌ఎన్‌ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్‌లో భాగంగానే ఇది ఉంటుందని తెలుస్తోంది. భీమ్ యుపిఐ ద్వారా దీని సేవలను యూజర్లు వినియోగించుకోవడానికి వీలుంటుంది. ఇతర డిజిటల్ చెల్లింపుల యాప్‌ల మాదిరిగానే బిఎస్‌ఎన్‌ఎల్ పే పని చేయనుంది. అన్ని రకాల చెల్లింపులు చేయడానికి వీలుంటుంది.

సమాఖ్య విధానం బలోపేతం

అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు తమిళనాడు సిఎం స్టాలిన్ లేఖ

చెన్నై : కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. నిజమైన సమాఖ్య విధానాన్ని బలోపేతం చేయాలని అందులో కోరారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య సంబంధాన్ని అధ్యయనం చేయడానికి తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ వెబ్‌సైట్‌లో తమ అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు.

రాష్ట్ర ప్రాధాన్యాలు ప్రభావితం చేస్తాయి!

"కేంద్ర స్థాయిలో పెద్ద మంత్రిత్వ శాఖలు ఉన్నాయి. అవి రాష్ట్ర విధులను ఖూనీ చేస్తాయి. ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లకు సంబంధించిన షరతులను, కేంద్ర పథకాల మార్గదర్శకాలను, కొన్ని ఆమోదాలను, రాష్ట్ర ప్రాధాన్యాలను అవి ప్రభావితం చేస్తాయి" అని స్టాలిన్ తన లేఖ లేఖలో ఆరోపించారు. "ఇప్పుడు మనం నిర్ణయాత్మక సమయంలో ఉన్నాం. ఈ పరిణామాలను తిరిగి అంచనా వేయడం, నిజమైన సమాఖ్యవాదాన్ని బలోపేతం చేసే భవిష్యత్తు ప్రణాళికను సృష్టించడం అవసరం" అని స్టాలిన్ అన్నారు.

ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

కేంద్రం, రాష్ట్రాల సంబంధాలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ గురించి ప్రస్తావించారు స్టాలిన్. ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్ కె. అశోక్ వర్ధన్ శెట్టి, తమిళనాడు ప్లానింగ్ కమిషన్ మాజీ వైస్- ఛాన్సలర్ మిగతా 7లో

ఎస్‌టి కమిషన్ ఆదేశాలు బేఖాతర్

కరేడులో ఆగని భూ సేకరణ ప్రక్రియ

గిరిజనుల ఆగ్రహంతో వెనుతిరిగిన అధికారులు

ప్రజాశక్తి - ఉలవపాడు (నెల్లూరు)

తాము పర్యటించి క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గుతేల్చేంతవరకు నెల్లూరు జిల్లా కరేడులో ఇండోసోల్ కంపెనీకోసం చేపట్టి భూ సేకరణ ప్రక్రియను ఆపాలంటూ జాతీయ ఎస్‌టి కమిషన్ ఇచ్చిన ఆదేశాలను అధికారయంత్రంగం పట్టించుకోలేదు. శనివారం నాడు కూడా సర్వే కొనసాగించారు. దీనిని స్థానిక గిరిజనులు ప్రతిఘటించి, తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు గ్రామం నుండి వెనుతిరిగారు. ఎస్‌టి కమిషన్ ఆదేశాలను సైతం అధికారయంత్రాంగం బేఖాతరు చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కరేడులోని రామకృష్ణాపురంలో రెవెన్యూ, సచివాలయ అధికారులు శనివారం ఉదయమే హౌస్‌హోల్డ్ సర్వే ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీ కూడా పాల్గొన్నారు. సర్వేలో భాగంగా తొలుత గ్రామసభ నిర్వహించి, స్థానికులతో ముఖాముఖి మాట్లాడానికి అధికారులు ప్రయత్నించారు. ఈ సభలోనే స్థానిక మహిళలు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'మా వివరాలు చెప్పం.. మా ఇళ్లు భూములు ఇవ్వం ' అంటూ తిరగబడ్డారు. ' ఈ గ్రామాన్ని వదిలి ఎక్కడికి పోము' అని స్పష్టం చేశారు. వారికి నచ్చచెప్పి సర్వేను పూర్తి చేసుకుపోవడానికి అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో హౌస్‌హోల్డ్ సర్వేను నిలిపివేసిన అధికారులు అక్కడి నుండి వెనుతిరిగారు. అనంతరం సమీపంలోని ఉప్పరపాలెంలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన గ్రామసభకు అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సమస్యలపై స్థానికులు వినతిపత్రం అందచేశారు.

సబ్ కలెక్టర్ హిమవంశీతో వాగ్వాదం చేస్తున్న గిరిజన మహిళలు

ఇది ఆక్షేపణీయం : రైతు సంఘం

ఎస్‌టి కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ భూ సేకరణ ప్రక్రియను కొనసాగించడం సరికాదని, అధికారుల ఈ చర్య ఆక్షేపణీయమని రైతు సంఘం పేర్కొంది. ఈ మేరకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య శనివారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో ఎస్‌టి కమిషన్ చెప్పినా పోలీస్ యాక్ట్ 30, 144వ సెక్షన్ విధించి రైతులను భయభ్రాంతులను చేసి భూ సేకరణ పనులను కొనసాగిస్తున్నారని తెలిపారు. అధికారుల ఈ చర్య రైతు, ప్రజా వ్యతిరేకమని పేర్కొన్నారు.

ఓట్ల తొలగింపు దేశానికే ప్రమాదం

- సురవరానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఇస్తాం: తెలంగాణ సిఎం
- గొప్ప ప్రజాస్వామికవాది : రాఘవులు
- సురవరం జీవితం అందరికీ ఆదర్శం :డి రాజా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వన్ నేషన్... వన్ ఎలక్షన్ కాదనీ, వన్ పర్సన్.. వన్ పార్టీ ఎలక్షన్ అనీ, ఇదే బిజెపి విధానమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే నిలబెట్టామని తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సురవరం సుధాకర్‌రెడ్డి లాంటివారు ఎంతో అవసరమని చెప్పారు. సువరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను సిపిఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించారు. సురవరం చిత్రపటానికి సిఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జస్టిస్ ఎన్‌వి రమణ, సురవరం సతీమణి బివి విజయలక్ష్మి, టిపిసిసి అధ్యక్షులు బి మహేష్‌కుమార్‌గౌడ్, బిఆర్‌ఎస్ నేత బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ కెవిపి రామచంద్రరావు, ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, టీజేఎస్ అధ్యక్షులు కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, కాశీం, సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత బి ప్రదీప్, ఎంసిపిఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి మురహరి, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాజా, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, సిపిఐ ఏపీ కార్యదర్శి కె రామకృష్ణ, తదితరులు ప్రసంగించారు.

సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

కలిసికట్టుగా పోరాడాలి : రేవంత్‌రెడ్డి

రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో పాలకుల విపరీతమైన పోకడలను కట్టడి చేసేందుకు, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు, భావసారూప్యత కలిగిన వారమంతా కలిసి కట్టుగా పోరాడాల్సిన అవసరముందని అన్నారు. ప్రజాస్వామిక మూల సిద్ధాంతానికి విరుద్ధంగా కేంద్రంలో పాలన సాగుతోందన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రమాదకర పరిస్థితులున్నాయని చెప్పారు.

సమాజంలో చైతన్యాన్ని పెంచేందుకు నిరంతరం శ్రమించిన కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు ఎంత ఎత్తుకు ఎదిగినా ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని వీడలేదన్నారు. ఏ జెండాను మోయడం గొప్పగా భావించారో చివరి శ్వాస వరకు ఆ జెండా నీడలోనే ఉండటం చాలా అరుదు అని అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డికి రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు ఉండే విధంగా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలి : రాఘవులు

సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి గొప్ప ప్రజాస్వామికవాది అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. పార్టీని నడిపిన తీరు, ప్రజలతో మమేకమైన పద్ధతి, ఉద్యమాలను నిర్వహించడంలో ఆయన చెరగని ముద్ర వేశారని అన్నారు. కమ్యూనిస్టు భావజాలానికి భిన్నంగా ఉండే వారినీ ఆయన ఆకర్షిస్తారని చెప్పారు. విషయం మీద రాజీపడకుండా అందర్నీ కలుపుకునిపోయే వ్యక్తిత్వం ఉందన్నారు. విశాల ప్రజానీకాన్ని, శక్తులను కలుపుకునిపోవడం ఇప్పుడు ఎంతో అవసరమని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి, హేతువాద భావజాలానికి తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. వాటిని రక్షించుకునేందుకు సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సురవరం జీవిత సామాజిక కార్యకర్తలకు, రాజకీయ పార్టీలకు ఒక సందేశంగా మారాలి : డి.రాజా

దేశం రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం సురవర సుధాకర్ రెడ్డి నిబద్ధతతో నిలబడి పోరాడారని, ఆయన జీవితం నేటి సామాజిక కార్యకర్తలకు ఆదర్శం కావాలని, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఒక సందేశంగా మారాలని డి.రాజా అన్నారు. దేశం నేడు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుందని, మితవాద శక్తులు నేరుగా రాజ్యాంగంపైనే దాడి చేస్తున్నాయని, ఇలాంటి పరిస్థితిలో సుధాకర్ రెడ్డి మరణం దేశానికే తీరని లోటని చెప్పారు.

డిఎస్‌సిలో అవకతవకలు సరిదిద్దాలి

- పిడిఎస్‌ఒ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి నియామకాల్లో అవకతవకలను సరిదిద్దాలని పిడిఎస్‌ఒ డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో క్షేత్రస్థాయిలో అనేక అవకతవకలను, గందరగోళాలను ఖండిస్తున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎ సురేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెలక్షన్ జాబితాను ప్రకటించకుండా గోప్యంగా ఉంచడం, కేటగిరీల వారీ కటాఫ్ మార్కులను విడుదల చేయలేదని, కొంతమందికి కాల్ లెటర్స్ పంపలేదని, కొందరు అభ్యర్థుల లాగిన్‌లో కాల్ లెటర్స్ కనిపించడం లేదని తెలిపారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియను సంపూర్ణ పారదర్శకతతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్‌జిటి, ఎస్‌ఎ, టిజిటి, పిజిటి పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులకు నచ్చిన పోస్టును ఎంచుకునే స్వేచ్ఛ కల్పించాలని కోరారు.

శాంతియుతంగా వినాయక నిమజ్జనాలు

- పోలీసులు చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

వినాయక నిమజ్జనం, ఊరేగింపులు శాంతియుతంగా జరిగేందుకు వీలుగా పోలీసులు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. అవసరమైతే అదనంగా పోలీసులను వినియోగించాలంది. కర్నూలు జిల్లా ఆదోని ప్రధాన రహదారి మీదుగా విశ్వహిందూ పరిషత్, వినాయక ఉత్సవ కమిటీ ఈ నెల 31న వినాయక నిమజ్జనం ఊరేగింపు నిర్వహణకు పోలీసులు అనుమతినివ్వాలని ఆదేశించింది. భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ జడ్జి ఆర్డర్‌ను సవాల్ చేస్తూ ఆదోని డిఎస్‌పి వేసిన అప్పీల్‌ను కొట్టేసింది. ఇతర మతాల మనోభావాలు దెబ్బతినకుండా కార్యక్రమాలు ఉండాలంది. ఈ మేరకు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరి హరనాథ శర్మతో కూడిన ధర్మాసనం శనివారం ఆదేశాలు జారీ చేసింది. ఆదోని కాలువలో నిమజ్జనం చేసేందుకు ఆర్ట్స్ కళాశాల, శ్రీకృష్ణ ఆలయం, ఎమ్మిగనూరు కూడలి, ఆంజనేయస్వామి టెంపుల్, నిర్మల టాకీస్, రెండో పట్టణ పోలీస్ స్టేషన్, శ్రీనివాస భవన్, కొత్త బ్రిడ్జి మార్గం ద్వారా ఊరేగింపు నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీనిపై విహెచ్‌పి జిల్లా అధ్యక్షులు ఎ బసవన్నగౌడ్ వేసిన పిటిషన్‌లో సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి డివిజన్ బెంచ్ నిరాకరించింది. విహెచ్‌పి రూట్‌లో మసీదు ఉందని చెప్పి రూట్ మార్పు చేయాలన్న పోలీసుల అప్పీల్‌ను తోసిపుచ్చింది.

ఎఐపై విస్తృత నైపుణ్యాలను పెంచుకోవాలి

- ప్రీతమ్ సింగ్ స్మారకార్థంలో తెలంగాణ స్పీకర్ ప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్

స్పీకర్ ప్రసాద్ కుమార్

కృత్రిమ మేధ (ఎఐ) ఆధారిత ఆవిష్కరణలు, నైతికతకు హబ్‌గా హైదరాబాద్ మారుతోందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ప్రీతమ్ సింగ్ స్మారకార్థం డాక్టర్ ప్రీతమ్ సింగ్ ఫౌండేషన్, ఐఐఎల్‌ఎం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మాదాపూర్‌లో ఉన్న టెక్ మహీంద్రాలో 'మానవ మూలం : కృత్రిమ మేధ, నైతికత, భవిష్యత్తు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. అల్గారిథమ్ పక్షపాతం, డేటా గోప్యతకు ముప్పు, ఉద్యోగాల కోత వంటి అంశాలపై ప్రసాద్ కుమార్ హెచ్చరించారు. ఈ రంగంలో విస్తృతంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. మన దేశంలో రూపొందించే ఎఐ న్యాయం, పారదర్శకత, సమగ్రత వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉన్నత విద్యలో ఎఐ లిటరసీ, డేటా సైన్స్, ఎథిక్స్‌ను అనుసంధానించడం అవసరమన్నారు.

డిఎస్‌సి స్పోర్ట్స్ కోటాలో నకిలీ దరఖాస్తులపై చర్యలు తప్పవు

- శాప్ ఛైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సిలో స్పోర్ట్స్ కోటా కింద కొంతమంది అభ్యర్థులు నకిలీ పత్రాలతో దరఖాస్తు చేసుకున్నారని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ రవినాయుడు వెల్లడించారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిఎస్‌సిలో స్పోర్ట్స్ కోటా కింద ఉన్న 421 పోస్టులకు సుమారు 9 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 870కు పైగా నకిలీ ధృవ పత్రాలు వచ్చాయని తెలిపారు. తప్పుడు పత్రాలు పొందుపరిచిన క్రీడాకారులు, జారీ చేసిన అసోసియేషన్లపై కేసులు తప్పవని చెప్పారు. శాప్ గుర్తింపు లేని అసోసియేషన్ల తరపున ఆడిన క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్రీడా సంఘాలు కూడా శాప్ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని, క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలిపారు.

ఒక క్రీడకు ఒక సంఘమే ఉండాలని, లేదంటే తాము జోక్యం చేసుకుంటామని చెప్పారు. 'ఆడుదాం ఆంధ్రా' అవినీతిపై ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక అందిందని వెల్లడించారు. ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్ పేరుతో రాష్ట్ర స్థాయి పోటీలను శాప్ ఆధ్వర్యాన నిర్వహించామని, ఈ పోటీల్లో 24,121 మంది క్రీడాకారులను భాగస్వామ్యం చేశామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది 3 లక్షల మందిని భాగస్వామ్యం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు ఎన్‌ఆర్‌ఐలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ ఎస్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన వెయిట్‌లిఫ్టర్ ఎస్ వేణుగోపాల్‌ను ఎన్‌ఆర్‌ఐ యడ్లపల్లి రాకేష్ పి-4 కింద రెండేళ్లపాటు దత్తత తీసుకునే కార్యక్రమం రవినాయుడు ఆధ్వర్యాన జరిగింది.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల విషయంలో తెలంగాణ క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ పేర్లను ఖరారు చేసింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ అమీర్ అలీఖాన్‌ల నియామకాన్ని ఇటీవల సుప్రీంకోర్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన క్యాబినెట్ భేటీలో ఇదే కోటాలో తిరిగి కోదండరాంతో పాటు కొత్తగా అజారుద్దీన్ పేరును క్యాబినెట్ ఖరారు చేసింది.

సీట్ చోర్ కోసమే రాజ్యాంగ సవరణ

- ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరం
- ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

సీట్ చోర్ కోసమే ప్రజాప్రతినిధులను పదవి నుంచి తప్పించేలా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేస్తోందని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవి అభిప్రాయపడ్డారు. కర్నూలు యుటిఎఫ్ భవన్‌లో పలువురు మేధావులు, విద్యావేత్తలు, ప్రజాసంఘాల నాయకులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఎన్నికల తర్వాత అనుసరిస్తున్న తీరు పలువురిని ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల తరుపున జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఐక్య అభ్యర్థిగా ఉన్నారని, న్యాయమూర్తిగా గతంలో ఆయన ఇచ్చిన తీర్పును బట్టి మావోయిస్టు అని హోం మంత్రి ముద్ర వేస్తున్నారని విమర్శించారు. దీన్ని బట్టి భావ ప్రకటన స్వేచ్ఛ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. అఖండ భారతదేశంలో ఉన్న వాళ్లందరూ హిందువులే అని ఒకాయన ప్రకటన చేశారని, 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 19 శాతం మైనార్టీలే ఉన్నారని, మరి వారి సంగతి ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగానికి భాష్యం చెప్పాల్సిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులకే రక్షణ లేకుండా పోయిందన్నారు. సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసేలా రాష్ట్రాల్లో పాలకులను పక్కనపెట్టి గవర్నర్లు బిల్లులను తొక్కి పెట్టవచ్చని కేంద్రం అఫిడవిట్ దాఖలు చేయడం సిగ్గుచేటన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవి

తన ఫోన్ ద్వారా యుద్ధం ఆపానని ట్రంప్ చెబుతుంటే అది అబద్ధమని దేశం తరపున ఎవరూ చెప్పడం లేదన్నారు. ట్రంప్ ఎప్పుడు ఒకే విధంగా ఉన్నారని, దాన్ని చిత్రీకరించిన విధానం ఒక షో అని విమర్శించారు. భారతదేశానికి ఆర్థికంగా లాభం చేకూర్చే పని అమెరికా ఏమి చేసిందని, దేశ ప్రజలను చాలా వేధిస్తున్నారని చెప్పారు. ప్రైవేటీకరణలో పోలవరం, బనకచర్ల భాగమేనని, వీటి దశల్లో ఆగిపోయిన ప్రాజెక్టును పట్టించుకోకుండా బనకచర్ల గురించి మాట్లాడుతున్నారని తెలిపారు. ఎఐ వల్ల 72 శాతం నియామకాలు తగ్గిపోతాయని, జాబ్ లెస్ గ్రోత్ పెరుగుతుందని చెప్పారు.

నా హత్యకు కుట్ర

- బెదిరింపులకు భయపడను
- ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

తన హత్యకు కుట్ర జరిగినట్లు వీడియో రికార్డులు చెబుతున్నాయని, వాటికి భయపడే ప్రశ్నే లేదని నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆయన కార్యాలయంలో శనివారం నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున అనుచరులు చేరుకుని సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓ వీడియో చూసి షాక్‌కు గురయ్యానని, హుందా రాజకీయాలకు చిరునామా అయిన నెల్లూరులో రౌడీ షీటర్లు మాట్లాడుకోవడం చూసి ఆశ్చర్యం వేసిందన్నారు. ఈ విషయం ఎస్‌పికి మూడురోజుల క్రితమే తెలిసినా తనకు సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. తనకు జాగ్రత్త చెప్పలేదన్నారు. రౌడీ షీటర్లు తనను చంపేస్తే డబ్బే డబ్బు అన్నారని, ఎవరు వారికి డబ్బు ఇస్తామన్నారు అని సందేహం వ్యక్తం చేశారు. పోలీసు విచారణలో తేల్చాలని కోరారు. తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కుట్ర అంటూ వైసిపి ప్రచారం చేసిందని ఆరోపించారు. రూరల్ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, మూడోసారి ఎమ్మెల్యే అయి 14 నెలలు అయిందని, ఏ ఒక్క వైసిపి కార్యకర్తనైనా తాను ఇబ్బంది పెట్టానా అని ప్రశ్నించారు.

జిల్లాలో 30 యాక్టు అమలు : ఎస్‌పి జి.కృష్ణకాంత్

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 2025 సెప్టెంబర్ 30 వరకు '30 పోలీస్ యాక్ట్' అమలు శనివారం ఎస్‌పి జి.కృష్ణకాంత్ తెలిపారు. ఈ యాక్టు అమల్లో ఉన్నందున ప్రజా సంఘాలు, యూనియన్లు, రాజకీయ పార్టీలు, సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలంటే స్థానిక పోలీస్ అధికారి నుంచి ముందుగా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదైనా ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉంటే, పోలీస్ అధికారి ఆ సమావేశాన్ని నిషేధించవచ్చని, లేదా ఆంక్షలు విధించవచ్చని చెప్పారు.

మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్

- ఇదే జనసేన విధానం
- 'సేనతో సేనాని' బహిరంగ సభలో పవన్ ప్రకటన
- మరో 15 ఏళ్లు 'కూటమి'కే అధికారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఎంవిపి.కాలనీ

' కులం కోసమో, కుటుంబం కోసమో పెట్టిన పార్టీ కాదని. దేశ భవిష్యత్తు కోసం పెట్టిన పార్టీ జనసేన. 2030 నాటికి రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నాం. మెంబర్‌షిప్ టు లీడర్‌షిప్ జనసేన విధానం' అని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖ వన్‌టౌన్ ఏరియా ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో శనివారం సాయంత్రం 'సేనతో సేనాని' బహిరంగ సభ నిర్వహించారు. వేదిక నుంచి పార్టీ శ్రేణులకు పవన్ దిశానిర్దేశం చేశారు. జనసేన రోడ్‌మ్యాప్ తయారయ్యేసరికి పార్టీ కార్యకర్తలు, వీరమహిళలు మరింత బలంగా ఎదగాలని పిలుపునిచ్చారు. 15 ఏళ్ల పాటు కూటమి అధికారంలో ఉండాలన్నారు. పార్టీ కార్యకర్తల మాటలు వినాలనే మూడు రోజులపాటు విశాఖలో రాష్ట్ర విస్తృత సమావేశాలు ఏర్పాటు చేశానని చెప్పారు. ఇకపై తానే పార్టీ ఆఫీసు నుంచి మానటరింగ్ చేస్తానని తెలిపారు. 2014లో పార్టీని స్థాపించి అనేక కష్టాలు వచ్చినా నిలబడడం వల్ల పదేళ్ల తరువాత విజయం సాధించి దేశమంతా జనసేన గురించి మాట్లాడుకునేలా చేశామన్నారు. అధికారం ఉన్నా ఎలాంటి కాంట్రాక్టులూ తాను తీసుకోలేదని చెప్పారు. సగటు మనిషి ఆవేదన నుంచి జనసేన పుట్టిందన్నారు. అధికారంలో భాగస్వామ్యం కావాలని నిర్ణయించామని, సంపూర్ణమైన అవగాహనతోనే ఈ వేదికపై నుంచి మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు. విద్యార్థి, యువజన, కార్మిక, కర్షక, మహిళా ఇలా అన్ని రంగాల్లోనూ పూర్తికాలం కార్యకర్తలను నియమించాలని జనసేన భావిస్తోందన్నారు. స్థానికంగా జరిగే ఏ ఎన్నికల్లోనైనా మహిళలు భాగస్వామ్యం కావాలని కోరారు. పార్టీ సాధించిన ప్రగతిని, విజయాలను వివరించారు. 2014లో తాను ఏ నిబద్ధతతో పార్టీని పెట్టానో అదే నిబద్ధతను కొనసాగిస్తున్నానని చెప్పారు. తన సిద్ధాంతాన్ని పలువురు నాయకులు అపహాస్యం చేస్తూ ఎగతాళిగా మాట్లాడారని, ఈ రోజు వారి నోళ్లు మూయించే స్థాయికి జనసేన ఎదిగిందన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపగలిగాం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపగలిగామని పవన్ అన్నారు. తెలుగు ప్రజల మనోభావాలతో ఈ ప్లాంట్ ముడిపడి ఉందని, రూ.వేల కోట్లు నిధులు సాధించి పెట్టామన్నారు. గత ప్రభుత్వం విశాఖ రైల్వేజోన్‌కు భూమి కూడా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం వచ్చాక జోన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పోలవరానికి నిధులు సాధించామని, ఒక దశాబ్ద కాలం తనకిస్తే దేశ నిర్మాణంలో కీలక వ్యక్తులుగా చేసే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. కూటమికి 15 ఏళు నిరంతరాయ పాలన ఉండాలని, చిన్న చిన్న పొరపాట్లున్నా తాను చంద్రబాబుతో మాట్లాడే బాధ్యత తీసుకుంటానని అన్నారు. లేదంటే అరాచక, చీకటి పాలన మళ్లీ వచ్చేస్తుందంటూ వైసిపినుద్దేశించి వ్యాఖ్యానించారు.

దసరాకు సిద్ధంకండి

దసరాకు 'త్రిశూల్' కార్యక్రమాన్ని తాను చేపడతానని పవన్ అన్నారు. భద్రత, గుర్తింపు, నాయకత్వం అంశాల ఆధారంగా త్రిశూల్ ఉంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని కార్యకర్తలందరికీ రాష్ట్ర, జిల్లా కేంద్రాలతో నేరుగా సంబంధాలు ఉండేలా చూస్తామన్నారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని, జనసేన పార్టీలోనూ 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కొనసాగిస్తామని చెప్పారు. సభా వేదికపై పార్టీ మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ సహా ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ముఖ్య నేతలు ఉన్నారు.

త్వరలో యాత్రికులకు అందుబాటులోకి వసతి సముదాయం-5

ప్రజాశక్తి - తిరుమల

యాత్రికుల సౌకర్యార్థం నిర్మించిన వసతి సముదాయం-5ను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలో నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5ను అదనపు ఇఒ సిహెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. భవనంలోని హాళ్లు, కల్యాణ కట్ట, మరుగుదొడ్లు, అన్నప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందీ తలెత్తకుండా అన్ని సదుపాయాలూ కల్పించాలని సూచించారు. అనంతరం ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు అద్భుతంగా ఈ సముదాయం-5ని నిర్మించారని అభినందించారు. 2018లో గత టిడిపి ప్రభుత్వ హయాంలో బోర్డు ఆమోదం తెలిపిన ఈ ప్రాజెక్టు ద్వారా తిరుమలలో యాత్రికుల వసతి సమస్యకు కొంతమేర ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ప్రస్తుతం తిరుమలలో 45 వేలమందికి మాత్రమే వసతి సౌకర్యాలున్నాయని, కొత్తగా నిర్మించిన పిఎసి-5లో 2,500 మంది యాత్రికులు సులభంగా వసతి పొందగలరని వివరించారు. రానున్న బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీనిని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ సత్య నారాయణ, ఇఇలు వేణుగోపాల్, శ్రీనివాసరావు, సుధాకర్, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర, సోమన్నారాయణ, డిఇ చంద్రశేఖర్, విజిఒ సురేంద్ర పాల్గొన్నారు.

కుప్పం పేరిట దోచుకున్నది చంద్రబాబే

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కుప్పంకు జగన్‌మోహన్‌రెడ్డి నీళ్లిస్తే చంద్రబాబు తన ఖాతాలో వేసుకుంటున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. కుప్పం పేరిట దోచుకున్నది చంద్రబాబేనన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎవరు మంచి పనిచేసినా అది తనదేనని క్రెడిట్ వేసుకోవడంలో చంద్రబాబు దిట్టని తెలిపారు. శ్రీశైలం నుండి కుప్పం 720 కిలోమీటర్లు ఉంటుందని, 15 నెలల కాలంలో 560 కిలోమీటర్ల కాలువ తవ్వి నీళ్లు తీసుకెళ్లినట్లు చెబుతున్నారని అన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉండగా, చంద్రబాబు కుప్పానికి ఎందుకు నీళ్లు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. 14 ఏళ్లలో ఆ పని చేయలేదని, జగన్ చేస్తే తాను చేసినట్లు చెప్పుకుంటున్నారని అన్నారు.

వైద్య విద్య ఇన్‌ఛార్జి డైరెక్టరుగా రఘునందన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య విద్య ఇన్‌ఛార్జి డైరెక్టరుగా జి రఘునందన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 550ను వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు శనివారం విడుదల చేశారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి డైరెక్టరుగా ఉన్న అడిషనల్ డైరెక్టరు డిఎస్‌విఎల్ నరసింహం ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ప్రస్తుతం నియమించిన రఘునందన్ కూడా అడిషనల్ డైరెక్టరుగా వైద్య విద్య డైరెక్టరు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

క్యాంపస్ యాక్టివ్‌వేర్ ప్రచారకర్తగా కృతి సనన్

హైదరాబాద్ : ప్రముఖ పాదరక్షల కంపెనీ క్యాంపస్ యాక్టివ్‌వేర్ తమ మహిళల ఉత్పత్తుల విభాగానికి నటీ కృతి సనన్‌ను బ్రాండ్‌అంబాసిడర్‌గా నియమించుకుంది. ఇది దేశంలో మహిళల క్రీడా అథ్లెజర్ విభాగంలో వృద్ధిని ప్రతిబింబిస్తుందని ఆ కంపెనీ సిఇఒ నిఖిల్ అగర్వాల్ పేర్కొన్నారు.

తరలివచ్చిన రైతులు (శ్రీకాకుళం జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు ఎఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

యూరియా సరఫరా అరకొరే!

- కొన్నిచోట్ల అరబస్తాతో సరి
- రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం : రైతుల సమస్యల పట్ల పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ముందుచూపు లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. యూరియా కోసం రోజుల తరబడి రైతులు ఎక్కడో ఒకచోట ఆందోళనలు చేస్తుండటమే అందుకు నిదర్శనం. ఎరువుల కోసం రైతులు గగ్గోలు పెడుతున్నా... పాలకులు పెడచెవిన పెడుతున్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేదని ఉన్నతాధికారులు ప్రకటించడం తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు అవస్థలు తప్పడం లేదు. యూరియా కోసం తెల్లారేసరికి రైతు సేవా కేంద్రం వద్ద కాపలా కాస్తే, అరబస్తా మాత్రమే ఇస్తుండటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రైతులు శనివారం ధర్నాకు దిగారు. తమకు అరకొరగానే సరఫరా చేస్తున్నారని, ప్రయివేటు డీలర్లకు దొడ్డిదారిన టన్నుల యూరియాను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని వాపోతున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద రైతులు శనివారం ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం చేపట్టారు. పత్తి, మొక్కజొన్న, మిర్చి తదితర పంటలను మొత్తం 25 వేల ఎకరాల్లో సాగు చేశారని, ఎకరానికి 2 కట్టల చొప్పున 50 వేల యూరియా బస్తాలు అవసరం కాగా, అరకొరగా ఇస్తున్నారని ఎపి రైతు సంఘం నాయకులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరత కారణంగా రూ.260 కాకుండా ప్రైవేటు వ్యాపారుల వద్ద గత్యంతరం లేక రూ.300 నుండి రూ.400 వరకు చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

ఎఒపై బహిరంగ విచారణ

ఎ.కొండూరు మండల వ్యవసాయాధికారిపై వచ్చిన ఆరోపణలపై మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సాయి మల్లికా, ఎ.కొండూరు తహశీల్దార్ కె.లక్ష్మీ శనివారం విచారించారు. మార్క్‌ఫెడ్ పంపిన 50 టన్నుల యూరియా ఏమైందన్న దానిపై ఎ.కొండూరు మండలం చీమలపాడులోని కో ఆపరేటివ్ సొసైటీలో రైతుల సమక్షంలో విచారణ జరిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని విచారణాధికారులు తెలిపారు.

శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నీలంపేట రైతు సేవా కేంద్రం వద్ద ఎరువుల కోసం రైతులు క్యూ కట్టారు. ఈ కేంద్రానికి 220 యూరియా బస్తాలు రాగా ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా చొప్పున తహశీల్దార్ వై.వి.పద్మావతి సమక్షంలో పోలీసుల సహకారంతో ఎఒ ఉషారాణి పంపిణీ చేశారు.

తెల్లవారు జామునుంచే పడిగాపులు

విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలోని కొత్తబగ్గాం, పాతబగ్గాం రైతు సేవా కేంద్రాల్లో ఆయా పరిధిలోని రైతులకు ఎరువులు పంపిణీ చేస్తారని వ్యవసాయ శాఖ సిబ్బంది సమాచారం ఇచ్చారు. దీంతో శనివారం తెల్లవారుజాము నుంచే రైతులు ఆర్‌ఎస్‌కెల వద్ద పడిగాపులు కాశారు. పాతబగ్గాం రైతు సేవా కేంద్రం వద్ద బంగారంపేట, భూదేవిపేట, పాతబగ్గాం రైతులకు ఎరువుల పంపిణీలో గందరగోళం చోటుచేసుకుంది. దీంతో, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ అక్కడికి చేరుకుని, రైతుల సమస్య తెలుసుకుని, విఎఎ సునీతతో మాట్లాడారు. సచివాలయ పరిధిలో మూడు గ్రామాలకు 130 బస్తాల యూరియా మాత్రమే వచ్చినట్లు విఎఎ తెలిపారు. రైతులకు సరిపడా యూరియా లేదని ఎఒ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. మూడు గ్రామాల పెద్దలతోపాటు ఎఒ కిరణ్ కుమార్ అక్కడికి చేరుకుని, రైతులతో చర్చించారు.

చివరికి ఇద్దరు రైతులకు ఒక్కో బస్తా పంపిణీ చేయాలని నిర్ణయించారు. తప్పనిసరి పరిస్థితుల్లో అరబస్తా చొప్పున రైతులు తీసుకోవాల్సి వచ్చింది.

చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-బత్తలపల్లి

అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన చిత్రా రమేష్ (34) చేనేత వృత్తిపై జీవనం సాగిస్తున్నారు. మగ్గం నిర్వహణ, కుటుంబ పోషణ నిమిత్తం దాదాపు రూ.పది లక్షల వరకు అప్పులు చేశారు. వృత్తిలో తగిన ఆదాయం లేకపోవడంతో మగ్గం మానేసి కూలి పనులకు వెళ్తున్నారు. అప్పులు తీర్చడం కష్టతరం కావడంతో మానసిక వేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నార్పలలో యువతిపై వేధింపులు

- అడ్డొచ్చిన యువతి తండ్రిపై కొడవలితో దుండగుడు దాడి

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం జిల్లా)

తన కూతురిని వేధించవద్దంటూ అడ్డుపడిన తండ్రిపై ఓ యువకుడు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో శనివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... సూర్య నగర్ కాలనీలో నివాసముంటున్న మల్లారెడ్డి కుమారుడు అదే కాలనీకి చెందిన రామాంజనేయులు కుమార్తెను ప్రేమ పేరుతో గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. యువకుడి వేధింపులు తట్టుకోలేక యువతిని తల్లిదండ్రులు కళాశాల మాన్పించారు. అయినా యువకుడు వేధింపులు మానుకోలేదు. శనివారం ఉదయం ఆ యువకుడు యువతి ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో అప్పటికే తనతో తెచ్చుకున్న కొడవలితో యువతి తండ్రిపై దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులును కుటుంబ సభ్యులు నార్పల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

వైసిపి మాటలు హాస్యాస్పదం

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటం, ప్రజలకు న్యాయం చేయడం కూటమి ప్రభుత్వం లక్ష్యమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వైసిపి నేతలు శాంతిభద్రతల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సొంత తల్లి, చెల్లి, కుటుంబ సభ్యులకు రక్షణ లేక రాష్ట్రం వదిలిపోయారని పేర్కొన్నారు. సొంత పార్టీ ఎంపి కుటుంబాన్ని కిడ్నాప్ చేసి 48 గంటలు దాచిన చరిత్ర అని విమర్శించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, పేర్ని నాని వంటి వైసిపి నాయకుల రాజకీయ జీవితం ఎప్పుడో ముగిసిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ తీసుకురాలేని వైసిపి నేత కూడా మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడమే వారి రోజువారీ కార్యక్రమం అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అటకెక్కిన వంశధార ఆధునీకరణ

నందిగాం మండలం కణితివూరు వద్ద వంశధార ఎడమ కాలువ దుస్థితి

- ఎస్ఐఎంపి కింద ఎంపిక చేసినా ఆమోదం తెలపని కేంద్రం
- వెనుకబడిన జిల్లాపై బిజెపి సర్కారు ఉదాసీనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వెనుకబడిన జిల్లాలపై బిజెపి ప్రభుత్వం ఉదాసీనత కొనసాగుతోంది. విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ డబ్బులను ఆపేసిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా శ్రీకాకుళం జిల్లాకు సపోర్టు ఫర్ ఇరిగేషన్ మోడర్నైజేషన్ ప్రోగ్రామ్ (ఎస్ఐఎంపి) కింద సాయంపైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వ్యవసాయోత్పాదకత, నీటిపారుదల వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన సాయం, నైపుణ్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2020లో సపోర్టు ఫర్ ఇరిగేషన్ మోడర్నైజేషన్ ప్రోగ్రామ్‌ను రూపొందించింది. ఈ కార్యక్రమానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి) అందించనుంది. పాత మౌలిక సౌకర్యాల స్థానంలో కొత్త పద్ధతులను అనుసరించడం, నీటి వినియోగంపై మానిటరింగ్, పారదర్శక పద్ధతులను అనుసరించి వ్యవసాయోత్పత్తి, ఉత్పాదకత పెంచడం ఇందులో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. ప్రోగ్రాం పూర్తయిన తర్వాత వీటి నిర్వహణను సాగునీటి సలహా సంఘాలకు అప్పగించాలనుకుంది. రైతులకు సాంకేతిక సాయంతో పాటు ఆర్థిక సహకారం అందిస్తామని పేర్కొంది. రాష్ట్రంలో గోదావరి డెల్టా ఆధునీకరణ, సోమశిల ప్రాజెక్టులతో పాటు వంశధార ఎడమ కాలువ ఆధునీకరణ పనులకు మాత్రమే అవకాశం కల్పించింది. దీనిపై వంశధార అధికారులు 2021 జనవరిలో రూ.785.32 కోట్ల అంచనాలతో నివేదికను కేంద్రానికి పంపారు. ఐదేళ్లు గడిచినా నివేదికకు అతీగతి లేకుండా పోయింది.

సమగ్ర వివరాలతో నివేదిక

ప్రాజెక్టుకు సాయం కోసం కేంద్ర జలశక్తి శాఖ రూపొందించిన ప్రొఫార్మా ప్రకారం అధికారులు అన్ని రకాల ప్రశ్నలకూ బదులిస్తూ 2021 జనవరి ఒకటిన నివేదిక పంపారు. కాలువ గట్లు బలహీనంగా ఉండడం, కాలువల్లో నుంచి మట్టి జారిపోవడం, పలు సందర్భాల్లో కోతకు గురవ్వడంతో 2,480 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టాల్సి ఉండగా, 1930 క్యూసెక్కుల నీటినే విడిచిపెట్టాల్సిన పరిస్థితిని వివరించారు. కాలువ నిర్మించి 48 ఏళ్లు కావడంతో షట్టర్లు, ఇతర నిర్మాణాలు పూర్తిగా దెబ్బతిన్నాయని అందులో పొందుపరిచారు. ఎడమ కాలువ దుస్థితిని వివరించడంతో పాటు కేంద్ర జలశక్తి అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలను నివేదికలో పొందుపరిచారు. గతంలో ఈ పథకానికి ఏదైనా సంస్థ నిధులు ఇవ్వలేదని బదులిచ్చారు. గొట్టాబ్యారేజీ నిర్మాణంలో భాగంగా 1977లో కాలువను నిర్మించామని అధికారులు నివేదికలో పొందుపరిచారు. ఎకరాకు నీటితీరువా కింద రూ.200 వసూలు చేస్తున్నట్లు ప్రొఫార్మాలో పేర్కొన్నారు. వీటితో అనేక ప్రమాణాలకు సంబంధించి అధికారులు సంతృప్తికరమైన రీతిలో సమాధానాలు పొందుపరిచి నివేదిక పంపారు.

రెండు పర్యాయాలు కోతకు గురైన గట్లు

కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో, ప్రతి సంవత్సరం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతుంది. వంశధారలో గతేడాది ఆగస్టులో 80 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువన కుడివైపు గట్టు కోతకు గురైంది. హిరమండలం అక్కరాపల్లిలో గతేడాది జూలైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది.

ఐఒసి రూ.1.66 లక్షల కోట్ల

పెట్టుబడుల ప్రణాళిక

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద చమురు కంపెనీల్లో ఒక్కటైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) భారీ పెట్టుబడులకు సిద్ధమయ్యింది. వచ్చే ఐదేళ్లలో రూ.1.66 లక్షల పెట్టుబడి వ్యయాలను చేయనున్నామని ఆ కంపెనీ ఛైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ వెల్లడించారు. ఈ పెట్టుబడులను చమురు శుద్ధి, ఇంధన విక్రయం, రసాయన ఉత్పత్తులు, సహజ వాయువు, పునర్వినియోగ శక్తి రంగాలలో విస్తరణకు ఉపయోగించనున్నామన్నారు. తమ ప్రస్తుత 80.75 మిలియన్ టన్నుల ఆయిల్ శుద్ధీకరణను 2028 నాటికి 98.4 మిలియన్ టన్నులకు పెంచాలని యోచించామన్నారు. పానిపట్, గుజరాత్, బరౌనీలలో ప్రధాన విస్తరణలు జరుగుతాయనాన్రు. దేశంలోని 22,000 కిలోమీటర్ల పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను 21 ప్రాజెక్టులతో విస్తరిస్తోందన్నారు. ఇందులో నేపాల్‌లో కొత్త స్టోరేజీ సౌకర్యాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. రసాయన ఉత్పత్తులను తదుపరి వృద్ధి ఇంజిన్‌గా లక్ష్యంగా చేసుకుని, ప్రస్తుత 4.3 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని 2030 నాటికి 13 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, లాభాలను పెంచేందుకు ప్రత్యేక రసాయనాలపై దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇండియన్ ఆయిల్ 40,000 కంటే ఎక్కువ రిటైల్ ఇంధన విక్రయ కేంద్రాల నెట్‌వర్క్‌ను కలిగి ఉందన్నారు. వీటికి విద్యుత్ వాహన ఛార్జర్లు, బ్యాటరీ మార్పిడి కేంద్రాలు, సిఎన్‌జి. ఎల్‌ఎన్‌జీ పంపిణీ కేంద్రాలను జోడించనున్నామన్నారు. రూ.2.5 లక్షల కోట్లతో హరిత హైడ్రోజన్ ఉత్పత్తి, స్థిరమైన విమాన ఇంధనం, 1జిగావాట్ నుండి 18 జిగావాట్లకు పునర్వినియోగ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా 2046 నాటికి శూన్య ఉద్గారాలను సాధించాలని నిర్దేశించుకున్నామన్నారు. న్యాచురల్ గ్యాస్ వ్యాపారం 20 శాతం వృద్ధితో 7.9 మిలియన్ టన్నులకు చేరిందన్నారు. 2024-25లో 100 మిలియన్ టన్నుల విక్రయాలు, 20,000 కిలోమీటర్ల పైప్‌లైన్ నెట్‌వర్క్, 40,000 ఇంధన కేంద్రాలు ప్రతీ రోజు 3.2 కోట్ల వినియోగదారులకు సేవలందిస్తున్నాయని.. అదే విధంగా 15 కోట్ల మంది ఎల్‌పిజి గ్యాస్ వినియోగదారులను కలిగి ఉన్నామన్నారు. తమ పెట్టుబడులు దీర్ఘకాలిక విలువను సృష్టిస్తాయని సాహ్నీ తెలిపారు.

తగ్గిన విదేశీ విద్యా వ్యయం

న్యూఢిల్లీ : విదేశీ విద్యపై వ్యయాలు తగ్గాయి. ఈ ఏడాది జూన్‌లో విదేశాల్లోని తమ భారతీయ విద్యార్థుల కోసం 138.8 మిలియన్ డాలర్లు ఖర్చు చేశాయి. ఇది గడిచిన ఐదేళ్లలోనే కనిష్ట స్థాయి. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్‌లలో జరిగిన కఠిన వీసా, విద్యా సంస్థల్లో చేరికల పాలసీల్లో నెలకొన్న కఠిన నిబంధనలు, గందరగోళంతో విద్యార్థుల రెమిటెన్స్‌లో 10-15 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. గడిచిన ఐదేళ్లలో భారతీయ విద్యార్థుల సగటు వ్యయం 3.14 మిలియన్ డాలర్లుగా ఉంది. ఇటీవల ఈ వ్యయం దాదాపు సగానికి తగ్గింది. సెప్టెంబర్ 2021లో గరిష్ఠంగా 7.18 మిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

పర్యాటకంలో రూ.12 వేల కోట్ల పెట్టుబడులు

- యాత్రి నివాస్ ప్రారంభంలో మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఏడాది కాలంలో పర్యాటక రంగంలో దాదాపు రూ.12 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని, తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పలు కట్టడాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం విశాఖ ఎంవిపి.కాలనీలోని అప్పుఘర్ వద్ద ఆధునీకరణ పనులు పూర్తి చేసుకొని పర్యాటకుల సౌకర్యార్థం సిద్ధమైన హరిత హోటల్ (యాత్రి నివాస్)ను ఆయన ప్రారంభించారు. యాత్రి నివాస్‌లో జరిగిన పనులను పరిశీలించారు. అంతకుముందు ఆర్‌కె బీచ్ దగ్గర టూరిజం సిఆర్‌ఒ కౌంటర్‌ను ప్రారంభించారు. అక్కడి నుంచి పర్యాటకులు ఆర్‌కె బీచ్ నుంచి తొట్లకొండ వరకూ ప్రయాణించే డబుల్ డెక్కర్ బస్సుల టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చన్నారు. అనంతరం సెప్టెంబర్ 5 నుంచి 7 వరకు జరగనున్న వైజాగ్ ఫుడ్ ఫెస్టివల్ - 2025 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఎపిటిడిసి పరిధిలోని హోటళ్లు, రిసార్ట్‌లలో సరైన వసతి సౌకర్యాలు ఉండేలా మరింత ఆధునీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. కొన్ని పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం హబ్, టూరిజం సర్క్యూట్‌లు ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రంలో పబ్లిక్- ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో పర్యాటకాభివృద్ధి చేపడుతున్నామని వివరించారు. ఇప్పటికే చాలా మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ ఎంపి శ్రీభరత్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిపిఎం నేత గారపాటి విమల కన్నుమూత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విమల (ఫైల్)

సిపిఎం నేత గారపాటి విమల (94) శనివారం ఉదయం మరణించారు. వయో భారంతో ఏలూరు ఎన్‌ఆర్‌పేటలోని తన స్వగృహంలో కన్నుమూశారు. భౌతికకాయాన్ని ఆశ్రం మెడికల్ కళాశాలకు అప్పగించారు. విమల భర్త గారపాటి తాతన్న సోదరుడు గారపాటి సత్యనారాయణ. ఆయన సిపిఐ తరపున ఏలూరు నుంచి సిపిఐ తరుపున ఎమ్మెల్యేగా పని చేశారు. నూజివీడుకు చెందిన అమరజీవి పాతూరి వెంకటేశ్వరరావుకు విమల స్వయానా సోదరి. సిపిఎంలో సుదీర్ఘకాలం పాటు విమల పనిచేశారు. ఉపాధ్యాయ, మహిళా ఉద్యమాల్లో ఆమె కీలక పాత్ర పోషించారు. 1995లో ఉద్యోగ విరమణ తర్వాత ఐద్వా ఏలూరు డివిజన్ కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం సందర్శించి నివాళులర్పించారు. భౌతికకాయంపై సిపిఎం పతాకాన్ని కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. ఐద్వా పతాకాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి కప్పి నివాళులర్పించారు. గారపాటి విమల మృతి పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు , వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ , సిఐటియు రాష్ట్ర నాయకులు స్వరూపరాణి, వి.ఉమామహేశ్వరరావు సంతాపం తెలుపుతూ తమ సందేశాలు పంపించారు.

డ్యామ్ డిజైన్లకు ఆమోదం

- సిడబ్ల్యుసి అనుమతికి సిఫార్సు
- నేడు డీప్ సాయిల్ మిక్సింగ్‌పై సమావేశం
- గ్యాప్-2 డిజైన్లపై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రధాన డ్యామ్ డిజైన్లకు విదేశీ నిపుణుల బృందం ప్రాథమిక ఆమోదం ఇచ్చింది. ప్రాజెక్టు పనుల పరిశీలనలో భాగంగా శుక్రవారం కెనడాకు చెందిన రిచర్డ్ డొనెల్లీ, అమెరికాకు చెందిన డేవిడ్‌పాల్, డియాన్ ఫ్రాన్స్‌కో డిసిక్కో పోలవరంలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. పోలవరంలో శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన చేసిన నిపుణుల బృందం రెండోరోజు శనివారం ఉదయం డ్యామ్ ప్లానుపై సమగ్ర సమీక్ష నిర్వహించింది. ఆఫ్రే సంస్థ ఇచ్చిన ప్లానులో వివరాలపై సుదీర్ఘ చర్చ అనంతరం ప్రాథమిక ఆమోదం తెలిపింది. దీనికి సిడబ్ల్యుసి అనుమతికి పంపించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్ణయించింది. సిడబ్ల్యుసి అన్ని సాంకేతిక అంశాలను పరిశీలించి ఆమోదించాల్సి ఉంది. రెండోరోజు పర్యటనలో భాగంగా ఉదయం ప్రాజెక్టు నిర్మాణాలకు వినియోగిస్తున్న వస్తువులను పరిశీలించేందుకు క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ను నిపుణులు తనిఖీ చేశారు. డి.వాల్ నిర్మాణంలో అనుసరిస్తున్న పద్ధతులనూ అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుండి నేరుగా సమావేశ మందిరానికి చేరుకుని అధికారులతో డిజైన్లకు సంబంధించిన అంశాలను, ప్లాను తయారీ విధానం, నిర్మాణం చేపట్టబోయే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రధాన డ్యామ్‌కు సంబంధించి గ్యాప్-1, 2 అంశాలపై వివరాలు తీసుకున్నారు. ఆఫ్రే సంస్థ ఇచ్చిన ప్లాను సమగ్రంగానే ఉందని తేల్చారు. దీన్ని సిడబ్ల్యుసికి పంపనున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను నిపుణులకు సిఈ కె.నరసింహామూర్తి, మెగా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసరు సతీష్‌బాబు తెలిపారు.

నేడు డిఎస్‌ఎంపై చర్చ

పోలవరం డ్యామ్ నిర్మాణంలో కీలకమైన డయాఫ్రం వాల్‌కు దగ్గర్లో 500 మీటర్ల వెడల్పుతో డీప్ సాయిల్ ఉన్నట్లు గుర్తించిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని తొలిసారి ప్రజాశక్తి బయటపెట్టింది. దానిపై నిర్మాణాలు చేపట్టడంపై తొలి నుండీ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా దాన్ని కూడా కలిపి నిర్మాణాన్ని చేపట్టాలనే అంశంపై నేడు చర్చించనున్నారు. డిఎస్ఎం(డీప్ సాయిల్ మిక్సింగ్) ద్వారా నిర్మాణ కొనసాగింపునకు సంబంధించి ఇప్పటికే ఉన్న ప్రతిపాదనలను అధికారులు నిపుణులకు వివరించనున్నారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో అడుగున బంకమట్టి ఉందని, అక్కడ నిర్మాణం వల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని గతంలో పోలవరం అధికారులే నివేదిక ఇచ్చారు. అదివారం ఇదే అంశంపై చర్చ జరగనుంది.

పోలవరం వద్ద మ్యాప్‌లను పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణులు (ఫైల్)

సంపాదకీయం

నారీ రక్ష

రాత్రికి దానికంటూ ఒక అందం వుంది. ఒక ప్రత్యేకమైన గుర్తింపు వుంది. రాత్రిపూట కవిత్వం కురుస్తుంది. 'రాత్రి అందాలను ఎప్పుడూ అనుభవించనివాడు నిజమైన కవి/ కళాకారుడు కాలేడు' అంటారో రచయిత. రాత్రిపూట ప్రపంచం ఒక కలలా అనిపిస్తుంది. 'స్నానం చేసి తలారబోసినట్లు ఆకాశంలో నల్లటి చీకటి' అంటూ రాత్రి సౌందర్యాన్ని వర్ణిస్తాడు శీలా వీర్రాజు ఓ కథలో. లెక్కలేనన్ని ఆలోచనలు, చిత్రాలు, రూపకాలు, దుఃఖాలు, భయాలు రూపుదిద్దుకుంటాయి చీకటిలో. అర్ధరాత్రి ఆకాశం కింద ఫుట్‌పాత్‌లు రూపాంతరం చెందుతాయి. వెన్నెల వికసిస్తుంది. నల్లని తారు రోడ్లపై మృదువైన కిరణాలు నృత్యం చేస్తుంటాయి. అలసిన శరీరానికి, మనసుకు చంద్రుని వెలుగులో ఓదార్పు లభిస్తుంది. ఇంత అందమైన రాత్రి, స్త్రీలకు ఎందుకు చెడ్డదిగా, ప్రమాదకరమైనదిగా పరిగణించబడుతుంది? అమ్మాయిలు పురుషులతో సమానంగా ఎక్కడైనా స్వేచ్ఛగా జీవించగల ఈ సమాజంలో తమ కలలను సాకారం చేసుకోడానికి నిజంగా స్థలం లేదా? 'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః' అంటూ మహిళలను దేవతలుగా పూజిస్తారు. అదే సమాజం... నిజ జీవితంలో వారికి స్వేచ్ఛ, భద్రత, గౌరవం లేకుండా చేస్తున్నది. స్త్రీల పట్ల ఈ కపటత్వం ఎందుకు? పండు వెన్నెలయినా, వీధి దీపాలైనా రోడ్లను ప్రకాశవంతం చేస్తాయి. కానీ చాలామంది మహిళలకు ఈ చీకటి రాత్రులు కాళరాత్రిని తలపిస్తాయి. ఇంటికి వెళ్లే మార్గాన్ని భయం కబళించివేస్తుంది. జాతీయ వార్షిక నివేదిక మహిళల భద్రత సూచీ (ఎన్.ఎ.ఆర్.ఐ)-2025 ఈ విషయాన్ని ధృవీకరించింది.

దేశంలోని 31 నగరాల్లో సర్వే చేసిన జాతీయ మహిళా కమిషన్ 'నారీ సూచీ-2025' నివేదికను విడుదల చేసింది. ప్రతి ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురవుతుండగా, 40 శాతం మంది మహిళలు సురక్షితంగా లేమని ఫీలవుతున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. రాత్రి వేళల్లో ముఖ్యంగా ప్రభుత్వ రవాణా మార్గాల్లో, వినోద ప్రదేశాల వద్ద భద్రతకు సంబంధించిన అవగాహనలో తీవ్రమైన తగ్గుదల వుందని ఈ అధ్యయనం తెలిపింది. మహిళలకు రక్షణ లోపించిన నగరాల జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ వుండటం గమనార్హం. నాణేనికి రెండోవైపు అన్నట్లు... ఇంటి బయటే కాదు, ఇంట్లోనూ దాదాపు ఇలాంటి పరిస్థితే వుంది. అదనపు కట్నం కోసమో, అనుమానంతోనో, తనకన్నా ఎక్కువ సంపాదిస్తున్నదనో భార్యను హింసించడం, హతమార్చడం సర్వసాధారణంగా మారింది. 'భార్యాభర్తలన్నాక ఇదంతా మామూలే కదా...' అన్నాడు గ్రేటర్ నోయిడాలో భార్యను హత్యచేసిన తర్వాత... విపిన్ భాటీ అనే ఓ ఘనాపాటి. దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మహిళ హింసకు గురౌతోంది. దేశాభివృద్ధి కేవలం జీడిపి గణాంకాల్లో వస్తే చాలదు.. మన ఆలోచనా విధానంలో రావాలి. ఈ వికృత ధోరణులను పెంచి పోషిస్తోన్న వినిమయదారీ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలి. 'మహిళ స్వేచ్ఛ... హక్కు మాత్రమే కాదు, అది సమాజ ఆత్మకు శ్వాస' అంటారు సరోజిని నాయుడు.

దేశంలో సామాజిక కట్టుబాట్లూ, సంప్రదాయాలు మహిళల్ని కట్టిపడేసినంతగా...మగవాళ్లను పట్టించుకోవడం లేదు. 'విపిన్ భాటీ లాంటి వాళ్లుభార్యను హింసించడం మామూలే అన్న ధోరణిని చూసీ చూడనట్లుగా వుండటమో, చూసీ మౌనంగా వుండిపోవడమో అంటే, పరోక్షంగా మనమంతా ఈ నేరాలను సమర్థిస్తున్నట్లుగా, భాగస్వాములమైనట్లుగానో భావించాల్సిందే' అంటారో సామాజికవేత్త. ఐరాస చెప్పినట్లు.. మహిళలపై జరుగుతున్న హింసను మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలి. సమాజంలో మహిళలపై హింసను ప్రేరేపిస్తున్న విష సంస్కృతి పట్ల ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి. 'నేను ఆకాశాన్ని చేరుకున్నాను. కానీ, ప్రతి మహిళా భయంలేకుండా భూమిపై నడవగలగడం మరింత గొప్ప విజయమవుతుంది' అంటారు కల్పనా చావ్లా. మహిళ సురక్షితురాలు అయితేనే సమాజం సుసంపన్నం అవుతుంది. ఆమె భవిత కాంతివంతమైతేనే, దేశ భవిష్యత్ ఉజ్వలమౌతుంది. తమ బిడ్డలకు రాత్రిపూట భయపడకుండా... 'వెళ్లి చంద్రుడిని చూడండి, వెన్నెల్లో వీచే చల్లగాలిని ఆస్వాదించండి, స్వేచ్ఛగా జీవించండి' అని గర్వంగా చెప్పగలిగే పరిస్థితిని సృష్టిద్దాం.

మంచి మాట

చట్టం, న్యాయం ముసుగులో అన్యాయం రాజ్యమేలడం కంటే మించిన నిరంకుశత్వం మరొకటి లేదు.

- మాంటెస్క్యూ, ఫ్రెంచి రాజకీయ తత్వవేత్త.

6

రచనా రాక్షసుడు, పరిశోధనా సముద్రుడు ఆరుద్ర

సందర్భం

తెలకపల్లి రవి

నిజంగానే అనితర సాధ్యమైన ముద్ర ఆయనది. అందుకోసం అనవరతం శ్రమించారు. మార్క్సిస్టు దృక్పథంతో అనేక రంగాలలో సామాజిక పరిణామ చరిత్రను అక్షరబద్ధం చేయడానికి ఆఖరిదాకా అంకితమయ్యారు. ఆ విధంగా ఆయన పరిశోధనా సముద్రుడు. రచనా రాక్షసుడు. ఈ క్రమంలో ఆది నుంచి ఆయన ప్రజాశక్తితోనూ ప్రజా ఉద్యమాలతోనూ మమేకమయ్యారు. మార్క్సిజానికి తన నిబద్ధతను ప్రకటించుకున్నారు. నా జీవితం కమ్యూనిజానికే అంకితం పేరుతో ఆరుద్ర జ్ఞాపకాలను, ఆయన భార్య రామలక్ష్మి ఇంటర్వ్యూలు, లేఖలను శతజయంతి కానుకగా ప్రజాశక్తి ప్రచురించింది.

జననం : 31.8.1925 - మరణం : 4.6.1998

ఆరుద్ర శత జయంతి ముగింపు సందర్భంగా

ఆరుద్ర శతజయంతి ముగింపుకొస్తున్న సందర్భం. ఈ ఏడాది పొడుగునా అనేక చోట్ల ఆయనకు నివాళులర్పిస్తూ సాహిత్య లోకం అనేక సభలు, సదస్సులు, చర్చాగోష్టులు జరిపింది. ఆరుద్ర అనగానే అధ్యయనపరులకు సమగ్రాంధ్ర సాహిత్యం గుర్తుకు రావడం ఒకటైతే సమగ్రత అన్న పదం ఆయన జీవితమంతటికీ వర్తిస్తుంది. సమగ్రత, శాస్త్రీయత, స్పష్టత, వినమ్రత అన్న సూత్రాలను ఆయన మార్గదర్శకాలుగా పాటించారు. వాటితోపాటే నూతనత్వం, వైవిధ్యం అన్నవీ సొంతం చేసుకున్నారు. అందుకు ఆయన పేరు వినగానే కొందరికి కొండగాలి తిరిగింది లాంటి సినిమా పాటలు గుర్తుకు రావచ్చు. మరొకరికి వేమన నుంచి తిరుక్కులర్ దాకా వున్న సామాజిక వారసత్వం కళ్ల ముందు కదలాడవచ్చు. కవులకు త్వమేవాహం, కూనలమ్మ పదాలు వంటివి మదిలో మెదలొచ్చు. ఇంకా కొందరిని తమ నృత్య రీతులు, ఇంద్రజాలం, చదరంగం లోకి తీసుకుపోవచ్చు. 1925 ఆగస్టు 1న భాగవతుల శంకర శాస్త్రిగా పుట్టిన ఆరుద్రను ఆరో రుద్రుడుగా అభివర్ణించారు శ్రీశ్రీ ఓ సారి. నిజంగానే అనితర సాధ్యమైన ముద్ర ఆయనది. అందుకోసం అనవరతం శ్రమించారు. మార్క్సిస్టు దృక్పథంతో అనేక రంగాలలో సామాజిక పరిణామ చరిత్రను అక్షరబద్ధం చేయడానికి ఆఖరిదాకా అంకితమయ్యారు. ఆ విధంగా ఆయన పరిశోధనా సముద్రుడు. రచనా రాక్షసుడు. ఈ క్రమంలో ఆది నుంచి ఆయన ప్రజాశక్తితోనూ ప్రజా ఉద్యమాలతోనూ మమేకమయ్యారు. మార్క్సిజానికి తన నిబద్ధతను ప్రకటించుకున్నారు. నా జీవితం కమ్యూనిజానికే అంకితం పేరుతో ఆరుద్ర జ్ఞాపకాలను, ఆయన భార్య రామలక్ష్మి ఇంటర్వ్యూలు, లేఖలను శతజయంతి కానుకగా ప్రజాశక్తి ప్రచురించింది. వాటినోసారి వీక్షిస్తే 1940లలో కవిగానే గాక కమ్యూనిస్టు కార్యకర్తగా పనిచేస్తూ రచనలు ప్రజాశక్తికి పంపిన వైనం కళ్లకు కడుతుంది (బాక్సు చూడండి).

క్రమశిక్షణ, శ్రమ శిక్షణ

ఆరుద్ర రచనలూ, జీవిత విశేషాలు చాలా సార్లు చెప్పుకున్నవే. ఆయన అంత కృషి చేయడానికి అనుసరించిన క్రమశిక్షణ, శ్రమ శిక్షణ ఏమిటో చూద్దాం. సినిమా పాటలు రాస్తూ వచ్చిన ఆదాయాన్ని పుస్తకాలు కొనడానికి, పరిశోధన చేయడానికి ఉపయోగించారు. గొప్ప దర్శకుడు బి.ఎన్.రెడ్డి ఖడ్గతిక్కన చిత్రం తీయాలని తలపెట్టి సమాచారం అడిగితే ఖడ్గ తిక్కన కవి తిక్కన పూర్వాపరాలేమిటో లోతుగా తవ్వితీశారు. ఆ చిత్రం తీయలేదు గానీ తెలుగు సాహిత్య చరిత్రకు పునాదులు పడ్డాయి. అంతకు ముందు కవుల చరిత్రలు కేవలం సాహిత్యకారులకే పరిమితమైనాయి. ఆరుద్ర వంటి వ్యక్తి రాయడం వల్లనే ఈ చరిత్ర గురించి కాస్త ఆసక్తి వున్న చదువరులందరూ మాట్లాడుకునే అవకాశం కలిగింది. దాంట్లో సాహిత్య చరిత్రతో పాటు సామాజిక పరిణామం కూడా ఆయన నిక్షిప్తం చేశారు. మొదటి ముద్రణకు విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధాని, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ వంటి పాతవారితో పీఠికలు రాయించిన ఆరుద్ర ప్రజాశక్తి మలి ముద్రణలో ఆ పని చేయలేదు. ఈ కాలమంతటా అధ్యయనం చేయడం వల్ల విషయాలపై మరింత స్పష్టత వచ్చిందనీ, నేరుగా విషయంలోకి వెళ్లడమే మంచిదని భావించానని వివరణ ఇచ్చారు. మార్క్సిస్టు దృక్పథంతో అగాధ అధ్యయనం చేసి సముద్రమంత సమాచారం, విశ్లేషణ అందించినా ప్రత్యేకించి దాన్ని చాటుకోలేదు. రామాయణం, భారతం సహా ప్రాచీన కావ్యాల పట్ల సాహిత్యం పట్ల ఎలాంటి దృక్పథం అనుసరించాలనేదానికి ఆరుద్ర ప్రత్యక్ష ఉదాహరణ. తరతరాలుగా అల్లుకుపోయిన పురాణాలు ఇతిహాసాల పట్ల అవహేళన కాదు, అవగాహన ముఖ్యం అని ఆయన చెబుతుండేవారు. ఈ రోజుటి పాలకవర్గాలపై, దోపిడిదారులపై ఉపయోగించే భాష గతంపై వాడితే గాయపర్చడమా లేక జ్ఞానం పెంచడమా అనేది చూసుకోవాలన్నారు. మానవుడే మహనీయుడు అనడంలో ఆంతర్యం స్పష్టం. దేవాలయల మీద బూతు బొమ్మలెందుకు? అన్న తాపీ ధర్మారావు గారి రచనను స్మరిస్తూనే 'గుడిలో సెక్సు' అని కాలానుగుణంగా శీర్షిక మార్చి విషయం, వివరాలు పెంచడం ఆరుద్ర పద్ధతి. తెలుగునాట ప్రసిద్ధ సామెత తీసుకుని 'రాముడికి సీత ఏమవుతుంది?' వంటి రచనలతో సామాజిక పరిణామం చెబుతారు. ఇంద్రుడిని సవాలు చేసి గోవర్ధనగిరి నెత్తిన శ్రీకృష్ణుడు నాస్తికుడనీ, ఇంద్రుడు ప్రధాన దేవుడుగా వున్నప్పుడు ఉపేంద్రుడుగా వున్న విష్ణువు తర్వాత తనే దశావతారాలు దాల్చి దేవదేవుడై వెలసిన తీరు ఏమిటో ఆయన విశదీకరించినప్పుడు చాలామంది ఆశ్చర్యపోయారు.

పాటల్లోనూ అదే బాట

అన్ని చారిత్రిక ఆధారాలతో ఎవరూ ఆక్షేపించే అవకాశం లేకుండా జాగ్రత్త తీసుకునేవారు ఆరుద్ర. సినిమా పాటల్లో కూడా నమ్మకాలకూ చరిత్రకూ తేడా కూడా తప్పక పాటించేవారు. బాలరాజు కథలో "మహాబలిపురం మహాబలిపురం..." అన్న పాటలో "పాండవుల రథాలనీ పేరుబడ్డవి.." అని మాత్రమే అంటారు. అదే సినిమాలో మరో పాటలో 'ఎక్కడ బడితే అక్కడ వుంటే ఇక్కడికెందుకు వచ్చారని' దేవుడి గురించి సన్యాసిని ప్రశ్నిస్తారు."వేదంలా ప్రవహించే గోదావరి" అన్న పాటలో "ఆది కవిత నన్నయ్య రాసెనిచ్చట" అన్నారే గానీ ఆదికవి నన్నయ్య అనకపోవడం గమనించదగ్గది. "కట్టుకథల చిత్రాంగి కనకమేడలు" అంటూ ఆమె కథ కల్పనేనని సూచిస్తారు. "శ్రీకారం చుట్టుకుంది పెళ్లిపుస్తకం" పాట వింటే కూడా "మనసు మనసు కలవడమే మంత్రం పరమార్థం" అన్నారే గానీ నమ్మకాలు ఆపాదించలేదు. ఈ మధ్య వీరంగం చేసిన 'హరిహర వీరమల్లు' చిత్రం కోహినూర్ వజ్రం కథ అన్నారు గానీ ఆరుద్ర వ్యాసపీఠం చదివితే దాని అసలు కథ తెలుస్తుంది.

శ్రమజీవికి, స్త్రీలకూ గౌరవం

కమ్మరి చక్రం, సాలెల మగ్గం అని సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు అని శ్రీశ్రీ చెబితే ఆరుద్ర పంచాణం వారు అంటూ అయిదు వృత్తుల పరిణామ క్రమాన్ని ఎప్పుడూ చెబుతూ వచ్చారు. ఏ సమాజంలోనైనా ఉత్పత్తి కులాల, శ్రమ జీవుల, దళితుల జీవన క్రమం చూస్తేనే చరిత్ర అర్థమవుతుందనేవారు. స్త్రీలు ఏ వైపున పమిట వేసుకుంటారనేదానికి కూడా ఈ పరిణామంతో సంబంధం వుందని ఆయన చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తుంది. స్త్రీ పురుషులు, ఆడ మగ అనిగాక ఆయన మనిషి ఆడమనిషి అని కావ్యం రాయడం అందుకే. మనిషి అన్న మాట పురుషులకే గనక ఆడమనిషి అనాలన్నది మానవుడు, మానవి అనాలన్న భావన లాంటిదే. ఆయన విదేశీ పర్యటనలలో కూడా మార్క్సిస్టు సిద్ధాంతకర్తల చరిత్రకారులకు సంబంధించిన ఆధారాలు తీసుకు రావడానికి పరితపించేవారు. దేశమంతటా మాత్రమేగాక ప్రపంచ వ్యాపితంగా ప్రజా సాంస్కృతికోద్యమం ఏ విధంగా జరిగిందో గ్రంథస్తం చేయడం ఆయన లక్ష్యం. గురజాడ అప్పారావుకూ పంజాబీ పూరణ్ సింగ్‌కూ సంబంధమేమిటో తెలంగాణకూ గీతగోవిందానికి అనుబంధమేమిటో ఆయన వ్యాసాల్లో చూస్తాం. తనకన్నా ముందు రచనలు చేసిన వారిని ఆయన ఎప్పుడూ స్మరించేవారు. అంతర్జాతీయ గీతం అనువదించిన బాలాంత్రపు నళినీ కాంతరావుకే తన షష్టిపూర్తి సభలో "ప్రజాకళలు ప్రగతివాదులు" సమర్పించారు. త్వమేవాహం అంటే నీవే నేను అని అర్థం. తెలంగాణ సాయుధ పోరాటంపై ఆ కావ్యం రాసిన ఆరుద్ర వ్యక్తిపూజ కన్నా వ్యవస్థాగత మార్పు కీలకమనీ, అందుకు ఉద్యమించే శక్తులతో గొంతు కలిపి కదలడం రచయితల బాధ్యతనీ గుర్తించి ఆఖరుదాకా ప్రజాశక్తులతోనే నడిచారు. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత కూడా మరో ప్రపంచం మారి మనీ ప్రపంచం గెలవలేదనీ, శ్రీశ్రీ బాటలో మహాప్రస్థానం సాగిద్దామనీ పిలుపునిచ్చారు. "కలను నిజం చేసేది కాదు కవిత్వం/నిజాన్ని కలగనడం కవిత్వతత్వం" అంటూ వాస్తవికతకు పట్టం కట్టారు. సమసమాజం కోసం శాస్త్రీయ అధ్యయనం ఆచరణకు నిరంతరం ప్రేరణగా నిలిచే ఆరుద్ర మార్గంలో ముందుకు సాగుదాం. ఆయన మొదట్లోనే రాసినట్టు

నీలాల నింగిలో / ఎర్రజండాలతో/ ఎర్రజండాలతో / నీలాల నింగిలో / కదలవే కదలవే/ కొత్తమార్గాలకై.

★

ప్రజాశక్తితో చెరగని అనుబంధం - ఆరుద్ర

తొలి రోజులలో నా రచనలు శ్రీశ్రీకి పంపేవాడిని. కుటుంబరావు గారితో అనుబంధం ఏర్పడ్డాక ఆయనకు పంపేవాడిని. పెదపూడిలో ఆయన అభ్యుదయ పాఠశాలలో పాఠాలు చెప్తున్నప్పుడు వారికో ఉత్తరం రాసి ఒక కథ పంపించాను. 1946 మే 28వ తేదీ నాడు ఆయన నాకో ఉత్తరం రాస్తూ "కథ అందింది. కోపంతో రాసినట్టుంది. కథగా చూస్తే అట్టే పాకం లేదు. ప్రజాశక్తికి పంపిస్తున్నాను" అని రాశారు. నా రచనలు నేనే తర్వాత ప్రజాశక్తికి పంపేవాడిని.

...

1930వ దశకంలో వామపక్షానికి ఎంతో మద్దతుగా రచనలు చేసిన పాశ్చాత్య కవుల వల్ల నేను 40వ దశకంలో ప్రభావిత మయిన వాణ్ణే. సి.డే.లూయిస్, స్టీఫెన్ స్పెండర్, డబ్ల్యు.హెచ్.ఆడెన్ మొదలైన వాళ్ళ విశ్వాసాలు, విశిష్ట శిల్పరీతులూ నన్ను బాగా ఆకట్టుకున్నాయి. 'ఒకప్పుడు కమ్యూనిజాన్ని అభిమానించి, సోవియట్ యూనియన్ విధానాలను సమర్థించిన పాశ్చాత్య రచయితలు 1940వ దశకంలో కమ్యూనిస్టు వ్యతిరేకత చాటే గ్రంథ రచయితలయ్యారు. జార్జి ఆర్వెల్, ఆర్థర్ కోయిస్టలర్లు అటువంటివాళ్ళు. '1984', 'డార్క్‌నెస్ ఎట్ నూన్', 'ది గాడ్ దట్ ఫెయిల్డ్' వంటి పుస్తకాలు, 'ఎన్‌కౌంటర్' వంటి పత్రికలు చదవసాగాను. వీటిని పరిశీలనగా పఠించగానే శాస్త్రీయ సామ్యవాద మౌలిక సూత్రాల మీద నా విశ్వాసం మరింత గట్టిపడింది.

....

ఎమర్జన్సీ తరువాత నాకు సి.పి.యం వారి పాలసీతో భావసామ్యత బలపడ్డాక ప్రజాశక్తిలో నా రచనలు ప్రచురించే వాడిని. ప్రజాశక్తి దినపత్రిక అయ్యాక 1981 ఆగస్టు 1వ తేదీ నుండి ఒక సంవత్సరం వారం వారం ఆ పత్రికకు ఒక కవిత విధిగా పంపించేవాడిని. పాలసీలకు చేరువైనప్పుడే వాటిని సమర్థిస్తూ ప్రజా ఉద్యమాలు తోడ్పడినప్పుడే అనుబంధాలు ఏర్పడుతాయి. వారు నన్ను స్వంతం చేసుకొనడానికి ప్రయత్నించవలసిన అవసరం లేదు. అలాగే ఏ పార్టీ వారైనా నన్ను స్వంతం చేసుకొనడానికి ప్రయత్నిస్తే వాళ్ళకు హక్కు భుక్తమయ్యేటంత స్థితిలో నేను కూడా ఉండనన్న విషయం గ్రహించటం అవసరం. నా అంతట నేను నా విశ్వాసాలు అత్యంత సన్నిహితంగా ఉన్న పార్టీకే నా సాహిత్య సాంస్కృతిక సేవలు అర్పిస్తాను. అందుకే 1952 ఎన్నికలలో పాటలు రాసినట్టే 1982లో కూడా పాటలు రాశాను. ఇది గమనించండి.

కమ్యూనిస్టులు కమ్యూనిస్టులు కమ్యూనిస్టులు / కార్మిక కర్షక మధ్య తరగతులకెంతో యిష్టులు /విశాలాంధ్రలో ప్రజా రాజ్యమని / పిలుపిచ్చిన వాళ్ళెవరో /పోరాటంలో తెలంగాణలో / భూములు పంచినదెవరో ॥కమ్యూ॥ నీకై నాకై అందరి కొరకై / నెత్తురు చిందించేదెవరో /శ్రామిక రాజ్యస్థాపన కోసం/ ప్రాణాలిచ్చేదెవరో ॥కమ్యూ॥ (ప్రజాశక్తి-9.12.1982)

దశల పేరిట నిర్వాసితులను గాలికొదిలేస్తారా?

సమస్య

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే వైసిపి ఏలుబడిలో కునారిల్లిన పోలవరం ప్రాజెక్టును పట్టాలు ఎక్కించేందుకు హడావుడి చేశారు.

వాస్తవంలో కేంద్ర ప్రభుత్వం పోలవరం రెండవ దశ అని పేరు పెట్టి, మంత్రివర్గ సమావేశంలో ఆమోదించి మొదటి దశకు నిధులు విడుదల చేస్తున్నది. 45.72 మీటర్లు నిర్మించవలసిన పోలవరం ప్రాజెక్టును తొలి దశ అనే పేరుతో 41.15 మీటర్లకు పరిమితం చేసి నిర్మించేందుకు సిద్ధమైనారు. ఈ విషయంలో అటు వైసిపి ప్రభుత్వం ఇటు కూటమి సర్కారు దొందు దొందే. మొన్న స్వాతంత్ర్య దినోత్సవం రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ 2028 నాటికల్లా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.



వి. శంకరయ్య

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు మార్లు వెళ్లిన ఢిల్లీ పర్యటనల్లో ప్రధాన మంత్రిని, కేంద్ర జల వనరుల శాఖ, ఆర్థిక శాఖ మంత్రులను కలుస్తున్నా ఒక్క దఫా కూడా పోలవరం పూర్తి స్థాయి డిపిఆర్ గురించి ఎందుకు ప్రస్తావించడం లేదు? రాష్ట్ర ప్రభుత్వం వైపు నుండి కేంద్ర ప్రభుత్వానికి ఇంత వరకు అభ్యర్థన వెళ్ల లేదు. 2014-19 మధ్య కాలంలో టిడిపి హయాంలోనే ఇందుకు భిన్నంగా జరిగింది. ఒకవైపు ప్రాజెక్టు పనులు జరుగుతున్నా రెండవ డిపిఆర్ ఆమోదానికి సాంకేతిక సలహా కమిటీ సమావేశమైంది. ఈ కమిటీకి సమాచారం ఇచ్చేందుకు రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులు నానా తంటాలు పడ్డారు.

2019 ఫిబ్రవరిలో సమావేశమైన సాంకేతిక సలహా కమిటీ

55,548.83 కోట్ల రూపాయల వ్యయంతో రెండవ డిపిఆర్ ఆమోదించింది. ఇందులో నష్టపరిహారం పునరావాసానికే 33,868.23 కోట్లు. ఇది గతం. ఇప్పుడు ఈ అంచనాలు భారీగా పెరిగి వుంటాయి. ఇదిలా ఉండగా పోలవరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అంది రైతులు వ్యవసాయం చేయడం ఎప్పుడో! ఈ లోపు ప్రథమ లబ్ధిదారులు కావలసిన నిర్వాసితులు అన్యాయమై పోతున్నారు. ప్రస్తుతం 41.15 కాంటూరు



వరకు నిర్వాసితులకు అరకొరగానైనా నష్టపరిహారం పునరావాసం కల్పిస్తామంటున్నారేగాని ఇచ్చింది అరకొరే! అయితే గోదావరికి వరదలు వచ్చిన రోజుల్లో అంత వరకే గిరి గీసినట్లు వరద ప్రవాహం వుండదు.

41.15 కాంటూరు మించి వరద చుట్టుముడితే ఏం కాను? ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించినట్లు లేదు. 2022 వరదల్లో పరీవాహ ప్రాంత ప్రజల బాధలు వర్ణనాతీతం.

2017-18 నాటి అంచనాల మేరకు నిర్వాసితులకు నష్టపరిహారం పునరావాసానికే పెరిగిన అంచనాలు కలుపుకొని ఇంకా రూ.30వేల కోట్లు అవసరమౌతాయి. దాన్ని తప్పించుకోవడానికే కేంద్ర ప్రభుత్వం తొలి దశ అని పేరుబెట్టి మ మ అనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం కూడా ఇది సాధ్యం కాదని భావించే బనకచర్ల అనుసంధానం తలకెత్తుకున్నదనే అనుమానాలు లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వం కూడా జిమ్మిక్కులు చేస్తోంది. ఇప్పుడు పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అనే నినాదం పోయింది. గేమ్ ఛేంజర్ అంటూ బనకచర్ల అనుసంధానం తెర మీదకు వచ్చింది.

దురదృష్టమేమంటే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత లోపాలు తరచూ సంభవిస్తున్నాయి. జగన్మోహన్ రెడ్డి పాలనలో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయింది. తదుపరి స్పిల్ వే కు రక్షణగా నిర్మించిన గైడ్ బండ్ నిర్మాణ దశలోనే కూలి పోయింది. దీనికి బాధ్యులెవరనే దానిపై సాగిన చర్చ అంతిమంగా డిజైన్ లోపమని నెట్టి వేసి చేతులు దులుపుకున్నారు. నిర్మాణంలో నాణ్యత గురించి అందరూ గప్‌చుప్ అయ్యారు. ఇప్పుడు తాజాగా ఎగువ కాఫర్ డ్యాం ఒక చోట కుంగిందని చెప్పబడినా బద్దలు బద్దలుగా పగుళ్లు వచ్చిన ఫోటోలు బయటపడ్డాయి. అవి ఫేక్ ఫోటోలని జల వనరుల శాఖ ఖండించలేదు. ఇదీ పోలవరం పరిస్థితి.

/ వ్యాసకర్త విశ్రాంత పాత్రికేయులు /

విశాఖ స్టీల్‌పై పవన్‌కల్యాణ్ అసత్య ఆరోపణలు

విశ్లేషణ

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర బిజెపి ప్రభుత్వం వేగవంతం చేసింది. 2025 ఆగస్టు 16వ తేదీన విశాఖ స్టీల్‌ప్లాంట్ పనులను 32 విభాగాలుగా చేసి ఆపరేషన్, మెయింటినెన్స్ సహా అన్ని పనులు కాంట్రాక్టర్లకు సెప్టెంబర్ 10 నాటికి అప్పగించాలని ప్రకటించింది. మరో 2 విభాగాలకు జులై లోనే టెండర్లు పిలిచింది. అప్పటి నుంచి నోరు మెదపని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆగష్టు 29న నోరు విప్పారు. విశాఖపట్నంలో జరిగిన వారి ప్లీనరీ సమావేశాల్లో కేంద్ర బిజెపి నిర్ణయాలను సమర్ధించుకుంటూ కార్మిక సంఘాలపై విరుచుకు పడ్డారు. విశాఖ స్టీల్ ప్రధాన సమస్య సొంత గనులను కేంద్ర ప్రభుత్వాలు కేటాయించకపోవడం. ఏ భయం లేదన్న పవన్ కల్యాణ్ సొంత గనులు ఎందుకు రప్పించలేదు? దేశంలో అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు ఉన్నాయి. చట్ట ప్రకారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనం చేయాలనే సొంత గనులు కేటాయించలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లలో 2 బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూపివేశారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే ఉత్పత్తి నిలిపివేసింది. అందుకే "ఆడలేక మద్దెల ఓడు" అన్నట్లు సొంత గనులు అడగడం చేతకాక పవన్ కల్యాణ్ కార్మిక సంఘాలపై తీవ్రమైన అభాండాలు వేశారు. వైసిపి హయాంలో ఈ సంఘాలు ఏం చేశాయని ప్రశ్నించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని నిర్ణయించినప్పటి నుంచి (27.1.2021) జరుగుతున్న నిరవధిక పోరాటాలన్నీ పవన్ కల్యాణ్‌కు తెలుసు. కానీ కావాలనే ఈ తప్పుడు ఆరోపణలు చేశారు. 2021లోనే 2 రోజులు వేలాదిమందితో ఢిల్లీలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాము. 3 సార్లు సమ్మెలు, అనేక సార్లు విశాఖలోనూ, రాష్ట్ర వ్యాప్తంగానూ రాస్తారోకోలు, విశాఖ స్టీల్‌ప్లాంట్ దగ్గర 10 కిలోమీటర్ల మానవహారం జరిగాయి. రాష్ట్రంలోని బిజెపి మినహా అన్ని పార్టీలను ఆహ్వానించి 10 వేల మందితో భారీసభ నిర్వహించాం. విశాఖ నగరంలోనూ, స్టీల్‌ప్లాంట్ కూర్మన్నపాలెం వద్ద రిలే నిరాహార దీక్ష శిబిరాలు కొనసాగుతున్నాయి. కార్మిక సంఘాలు పోరాటాలు చేయలేదనడం పూర్తి అవాస్తవం. అప్పుడు, ఇప్పుడు పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. పోరాటంతోనే ప్రైవేటీకరణను అడ్డుకుంటాం. ప్రైవేటీకరణకు సహకరిస్తే కొందరికి ప్లాట్లు ఇస్తామని ఆశ పెడితే కొందరు ట్రేడ్ యూనియన్ నాయకులు తలలూపారని మరో తప్పుడు ఆరోపణ చేశారు. ఎవరు ప్లాట్లు కోసం తలలూపారు? ప్రకటించాలని సవాలు చేస్తున్నాం. లేదా ఇటువంటి ప్రకటన చేసినందుకు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి.



సిహెచ్. నర్సింగరావు



విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఆగిందని ప్రకటించడం రాష్ట్ర ప్రజలను పక్కదారి పట్టించడమే. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుండి కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాల వేగం పెంచింది. వేలాది మంది కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నది. బయోమెట్రిక్ పద్ధతితో కార్మికులను పని ప్రదేశాల్లో కట్టడి చేస్తున్నది. తొలగించిన కార్మికుల పని భారం పనిచేస్తున్న వారిపై తీవ్రంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూర్మన్నపాలెం నిరాహార దీక్ష శిబిరాన్ని కూల్చింది. దీక్షా శిబిరాన్ని తిరిగి నిర్మించకుండా రాష్ట్ర పోలీసులు అడ్డుకుంటున్నారు. హైకోర్టు నుండి ఆదేశాలు వచ్చినా ఖాతరు చేయడం లేదు. కార్మికులు, అధికారుల ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తున్నది. ప్రతి నెలా జీతాలలో 25 శాతం కోత విధిస్తున్నది. 20 శాతం ఇంటి అద్దె చెల్లించడం లేదు. విద్యుత్ చార్జీలు 16 రెట్లు పెంచింది. ప్రభుత్వ రంగంలో ఏ సమస్యనైనా యూనియన్లతో చర్చించి పరిష్కరిస్తారు. ఇక్కడ యూనియన్లతో చర్చల్లేవు. ప్రైవేట్ యాజమాన్యానికి కావాల్సిన విధంగా కార్మికులను తగ్గించి, జీతాలు అతి తక్కువ చెల్లించే పద్ధతులకు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌లో అమలు చేస్తున్న పద్ధతులన్నీ బడా ప్రైవేట్ కంపెనీకి అప్పజెప్పే మార్గం మాత్రమే.

విశాఖస్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చిన విషయాన్ని ప్రజల్లో గట్టిగా ప్రచారం చేయాలని వారి ఎమ్మెల్యేలకు, కార్యకర్తలకు పవన్ కల్యాణ్ ప్రబోధించారు. రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఎవరికోసం ఇచ్చారు? అప్పులు తీర్చడం పేరుతో విశాఖస్టీల్‌ను కొనే ప్రైవేట్ యాజమాన్యంపైన తక్కువ అప్పుల భారం కోసమే ప్యాకేజీ ఇచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన ముడిసరకు కొనుగోలుకు గానీ, యంత్రాల మరమ్మతులకు గానీ, కార్మికుల జీతాలకు గానీ ఈ ప్యాకేజీని ఏ మాత్రం ఉపయోగించలేదు. విశాఖలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) లాభాల్లో ఉండగా ప్రైవేట్ పరం కాకుండా కాపాడినట్లు గొప్పలు చెప్పుకున్నారు. ఇది వాస్తవం కాదు. విశాఖ ప్రజలు, సిఐటియు పోరాడి డిసిఐ ప్రైవేటీకరణను అడ్డుకున్నాయి. ఒక డిసిఐ కార్మికుడు చనిపోయినపుడు సిఐటియు శిబిరానికి వచ్చిన పవన్ కల్యాణ్ తమ వల్లనే డిసిఐ ప్రైవేటీకరణ ఆగిందని ప్రకటించుకోవడం అవివేకం. కేంద్ర బిజెపి ప్రభుత్వం లాభాలతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్క కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమను ప్రైవేటీకరిస్తామని పదేపదే ప్రకటిస్తున్నది. విశాఖ స్టీల్‌ను నూరు శాతం ప్రైవేటీకరించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించిన 2020-21లో కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.935 కోట్ల నికర లాభాలు వచ్చాయి. విశాఖ స్టీల్ బంగారు బాతు లాంటిది. రైతులు త్యాగం చేసి ఇచ్చిన 20 వేల ఎకరాలు సొంత భూములు, సముద్రతీరం ఉన్న ఏకైక స్టీల్‌ప్లాంట్ విశాఖ స్టీల్. దేశంలోని అన్ని స్టీల్‌ప్లాంట్ల కంటే అధునాతన స్టీల్‌ప్లాంట్ ఇది. అందుకే బడా ప్రైవేట్ కంపెనీల కళ్ళు విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై పడ్డాయి. దాన్ని అడ్డుకోవాల్సిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పోరాడుతున్న ట్రేడ్ యూనియన్లపై నెపం వేయడం దుర్మార్గం.

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రతిపక్షంలో ఉండగా విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద భారీ సభ నిర్వహించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు గురించి వైసిపి ప్రభుత్వం కేంద్రాన్ని ఎందుకు అడగడం లేదని వాదించారు. వైసిపి అమ్ముడు పోయిందని విమర్శించారు. అందుకే రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా గాజువాక ప్రజలు వైసిపిని ఘోరంగా ఓడించారు. కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజార్టీతో పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చిన కూటమి విశాఖ స్టీల్‌కు సొంత గనులు తీసుకు రాకపోగా వేలాదిమంది కార్మికులను తొలగించి నిర్బంధంతో విశాఖ స్టీల్ ఉద్యమాన్ని అణచాలని భావిస్తున్నది. కేంద్ర బిజెపికి తెలుగుదేశం, జనసేనలు అడ్డగోలుగా మద్దతిస్తూ ఆంధ్రప్రదేశ్‌కి తీరని ద్రోహం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తప్పుడు వైఖరికి మూల్యం చెల్లించక తప్పదని విశాఖ స్టీల్ కార్మిక సంఘాలు, రాష్ట్ర ప్రజలు హెచ్చరించక తప్పదని తెలియజేస్తున్నాం.

/ వ్యాసకర్త విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ /

ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్.,
HO : విశాఖపట్నం, RO : విజయవాడ
మంగళగిరి బ్రాంచ్, గుంటూరు జిల్లా. ఫోన్ : 08645-233222

అనుబంధం [IV] **స్వాధీనత ప్రకటన**

(రూల్ 8(1) క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (54 ఆఫ్ 2002) క్రింద **ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్., మంగళగిరి బ్రాంచ్, గుంటూరు జిల్లా** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 లో రూల్ 3 తో కలిపి చదువవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన **తేది.31.12.2024 నాటికి రూ.17,27,701/- (అక్షరాల పదిహేడు లక్షల ఇరవై ఏడు వేల ఏడు వందల ఒక్క రూపాయి మాత్రమే)** + **తేది.01.01.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు (తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడి) తిరిగి చెల్లించవలసినదిగా __ఋణగ్రహీతలు__ : 1) **శ్రీమతి కొండపల్లి సౌభాగ్య లక్ష్మి, తండ్రి : నాగరాజు,** డి నెం.40-17-74, లబ్బీపేట, పకీర్‌గూడెం, కొత్త ఇల్లు, విజయవాడ (అర్బన్), వెంకటేశ్వరపురం, కృష్ణా జిల్లా-520010. **2) శ్రీ పుటికలపూడి సతీష్, తండ్రి : పి. మల్లిఖార్జున రావు,** డి నెం.7-255/ఎ, 3వ లేన్, సుజాత నగర్, పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. __హామీదారులు :__ **3) శ్రీ పుటికలపూడి మల్లికార్జునరావు, తండ్రి : పి. కొండయ్య,** డి నెం. 7-255/ఎ, 3వ లేన్, సుజాత నగర్, పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. **4) శ్రీమతి పుటికలపూడి పద్మ, భర్త : పి. మల్లికార్జున రావు,** డి నెం. 7-255/ఎ, 3వ లేన్, సుజాత నగర్, పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001 వార్లను కోరుతూ **తేది.16.01.2025 న డిమాండ్ నోటీసును** జారీ చేసినారు.

ఋణగ్రహీతలు/హామీదారులు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు రూల్సు యొక్క 8వ రూల్తో కలిపి చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.26.08.2025** న దిగువ వివరించిన ఆస్తిపై స్వాధీనత తీసుకొన్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలు/హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **తేది.31.12.2024 నాటికి రూ.17,27,701/- (అక్షరాల పదిహేడు లక్షల ఇరవై ఏడు వేల ఏడు వందల ఒక్క రూపాయి మాత్రమే)** + **తేది.01.01.2025** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు (తదుపరి చెల్లింపులు ఏమైనా ఉన్నచో తీసివేయబడి) **ది కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్., మంగళగిరి బ్రాంచ్, గుంటూరు జిల్లా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

(ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 (8) లోని నిబంధనలు గమనించవలెను)

__స్థిరాస్తి వివరములు__

కృష్ణా జిల్లా, కంకిపాడు ఎస్‌ఆర్‌ఓ, పెనమలూరు మండలం, పోరంకి గ్రామం వద్ద ప్లాట్ నెం.11, రీ సర్వే నెం.323/2 నందు విస్తీర్ణం **301 చ॥గ॥లు లేదా 251.674 చ॥మీ॥లులోని** ఖాళీ ఇంటి స్థలం. **ఆస్తి హోల్డర్స్ పేర్లు : శ్రీమతి కొండపల్లి సౌభాగ్య లక్ష్మీ మరియు శ్రీ పుటికలపూడి సతీష్.** __హద్దులు :__ **తూర్పు** : కంది వెంకట రావు గారి ఆస్తి & డి. రాంబాబు గారి స్థలం – 82.0 చ॥అ॥లు, **పడమర** : డి. ప్రసాద్ గారి స్థలం యొక్క ఆస్తి – 82.0 చ॥అ॥లు, **ఉత్తరం** : కొండపల్లి ఖాజా గారి సర్వీస్ భూమి స్థలం యొక్క ఆస్తి – 33.0 చ॥అ॥లు, **దక్షిణం** : పంచాయితీ రోడ్డు – 33.0 చ॥అ॥లు.

తేది : 26.08.2025
స్థలం : మంగళగిరి

సం/- అధీకృత అధికారి
ది కనకమహాలక్ష్మీ కో-ఆపరేటివ్ బ్యాంక్ లి.,
మంగళగిరి బ్రాంచ్, గుంటూరు జిల్లా

ఎస్‌సిఓ సదస్సులో రోబోల సందడి

బీజింగ్ : చైనాలో తియాన్‌జిన్‌లో షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో రోబోలు సందడి చేయనున్నాయి. ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సు కోసం భారీ ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా పలు కీలక పనుల కోసం అనేక రోబోలను మోహరించారు. వీటిలో 'షియావో హి' అనే హ్యూమనాయిడ్ రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు భాషల్లో మాట్లాడుతూ అతిథులతో పాటు జర్నలిస్టులకు సహాయకారిగా నిలుస్తోంది. మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ రోబో విలేకరులను చిరునవ్వుతో పలుకరిస్తూ, వారితో సంభాషిస్తోంది. "హలో నేను షియావో హి. తియాన్‌జిన్‌లో ఎస్‌సిఒ సదస్సు కోసం రూపొందించిన అత్యాధునిక కృత్రిమమేధ సాంకేతికత కలిగిన రోబోను. అత్యంత విలక్షణమైన సేవలను అందిస్తాను' అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తోంది. చైనీస్, ఇంగ్లీష్, రష్యన్.. ఈ మూడు భాషల్లో ప్రావీణ్యం ఉండేలా షియావోను రూపొందించారు.

పలు భాషల్లో మాట్లాడటం, వివిధ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తానని, స్థానిక, అంతర్జాతీయ మీడియా కోసం చేసిన ఏర్పాట్లనూ వివరిస్తానని రోబో పేర్కొంది. కేవలం సమాచారాన్ని ఇవ్వడమే కాకుండా ప్రశ్నలకు తగినట్లుగా భావోద్వేగాలను ప్రదర్శించడం గమనార్హం. ఇందుకోసం అత్యాధునిక భావోద్వేగ గుర్తింపు అల్గారిథమ్‌లను పొందుపరిచినట్లు ఈ మరమనిషి స్వయంగా వెల్లడించింది. దీంతోపాటు మీడియా సెంటర్లో వాలంటీర్లకు ఐస్‌క్రీమ్‌లను అందించేందుకు మరో రోబోను ఏర్పాటు చేయడం విశేషం. ఇలా సదస్సులో అనేక పనుల్లో రోబోలు నిమగ్నం కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రోబో సాంకేతికతలో దూసుకెళ్తున్న చైనా.. ఇటీవల హ్యూమనాయిడ్ రోబోలకు వరల్డ్ గేమ్స్‌ను నిర్వహించింది. ఈ వరల్డ్ హ్యూమనాయిడ్ రోబో గేమ్స్‌లో దాదాపు 16 దేశాలకు చెందిన దాదాపు 280 జట్లు పాల్గొన్నాయి. ఫుట్‌బాల్, ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలు, టేబుల్ టెన్నిస్‌తోపాటు.. ఔషధాలను గుర్తించడం, వస్తువులను తీసుకెళ్లడం, క్లీనింగ్ సర్వీసెస్ వంటి విభాగాల్లో వివిధ రోబోలు పాల్గొన్న విషయం తెలిసిందే.

ప్రి క్వార్టర్స్‌కు సబలెంక, క్రేజికోవా

- ఆండ్రీవా, నవర్రో ఔట్..
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంకతోపాటు అన్‌సీడెడ్, రష్యాకు చెందిన క్రేజీకోవా ప్రవేశించారు. ఇక అమెరికాకు చెందిన లీతోపాటు 10వ సీడ్ నవర్రో, 5వ సీడ్ ఆండ్రీవా అనూహ్యంగా మూడోరౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. శనివారం జరిగిన మూడోరౌండ్ పోటీలో సబలెంక 6-3, 7-6(7-2)తో 31వ సీడ్, కెనడాకు చెందిన ఫెర్నాండెజ్‌ను, అన్‌సీడెడ్ క్రేజీకోవా 4-6, 6-4, 6-4తో 10వ సీడ్ నవర్రోను చిత్తుచేశారు. ఇక 5వ సీడ్, రష్యాకు చెందిన ఆండ్రీవా 5-7, 2-6తో అన్‌సీడెడ్, అమెరికా సంచలనం టౌన్సెండ్ చేతిలో ఓటమిపాలైంది.

జకోవిచ్ జోరు..

సెర్బియా స్టార్, 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్ జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన మూడోరౌండ్ పోటీలో జకోవిచ్ 6-4, 6-7(4-7), 6-2, 6-3తో నొర్రీ(బ్రిటన్)ను చిత్తుచేయగా.. 21వ సీడ్ మచాక్(చెక్) 7-5, 6-3, 6-1తో బాంబ్లే(ఫ్రాన్స్)ను ఓడించి ప్రి క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. మరో పోటీలో 17వ సీడ్ టఫీ(అమెరికా) 4-6, 3-6, 6-7(7-9)తో అన్‌సీడెడ్, జర్మనీకి చెందిన స్టఫ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. మరో పోటీలో 4వ సీడ్, ఫ్రిట్జ్(అమెరికా) 7-6(7-3), 6-7(9-11), 6-4, 6-4తో క్రైమ్(స్విట్జర్లాండ్)ను చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు చేరాడు.

ఇక పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన విజయ్ సుందర్-అనిరుధ్ చంద్రశేఖర్ జంట తొలిరౌండ్‌లో 3-6, 6-3, 6-4తో 8వ సీడ్ అమెరికా జంటను ఓడించి రెండోరౌండ్‌కు చేరగా.. మరోజంట బొల్లిపల్లి-బాలాజీ జంట 6-3, 6-7(8-10), 4-6తో అమెరికా-ఫ్రాన్స్ జంట చేతిలో ఓటమిపాలయ్యారు.

ట్రంప్ సుంకాలు చట్టవిరుద్ధం..

- అమెరికా ఫెడరల్ కోర్టు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు చట్టవిరుద్ధమనిఅమెరికా ఫెడరల్ కోర్టు తీర్పునిచ్చింది. టారిఫ్‌లను విధించేందుకు అధ్యక్షుడికి విస్తృత అధికారాలు లేవని స్పష్టం చేస్తూ, ఓ ఫెడరల్ అప్పీల్స్ కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. అధ్యక్షుడి అధికారాల పరిధిలో సుంకాల విధింపు లేదని, వాటిని నిర్ణయించే అధికారం కాంగ్రెస్‌దేనని స్పష్టం చేసింది. చట్టానికి విరుద్ధంగా ఉన్న సుంకాలు చెల్లుబాటు కావని తేల్చి చెప్పింది. 'ఈ చట్టంలో సుంకాల ప్రస్తావన లేదు. సుంకాలను విధించేందుకు అధ్యక్షుడికి ఉన్న అధికారాల పరిమితులను నిర్దేశించే విధానపరమైన రక్షణ చర్యలూ లేవు' అని 127 పేజీల రూలింగులో కోర్టు తెలిపింది. సుంకాలు, పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని, దీనిని చట్టం తోసిపుచ్చలేదని పేర్కొంది. గతంలో సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అపరిమితమైన అధికారాలు ఉండేవని, ఆ విధానానికి స్వస్తి చెప్పేందుకే 1977లో కాంగ్రెస్ ఓ చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేసింది. అయితే ట్రంప్ సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునేందుకు వీలుగా ఈ తీర్పు అమలును అక్టోబర్ 14 వరకు కోర్టు నిలిపివేసింది. అప్పటివరకు ప్రస్తుతం ఉన్న టారిఫ్‌లు యథావిధిగా అమల్లో ఉంటాయి. ఈ తీర్పు సుప్రీంకోర్టులో కూడా నిలబడితే, భారత్‌పై విధించిన 25 శాతం ప్రతిస్పందన సుంకం రద్దవుతుంది.

మండిపడిన ట్రంప్

అప్పీళ్ల కోర్టు నిర్ణయాన్ని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో విమర్శించారు. దీనిపై సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని తెలిపారు. కోర్టు నిర్ణయం అమెరికాను నాశనం చేస్తుందని మండిపడ్డారు. 'సుంకాలను ఎత్తివేయాలని ఈ రోజు అత్యంత పక్షపాతపూరితమైన అప్పీళ్ల కోర్టు తప్పుడు తీర్పు చెప్పింది. కానీ చివరికి అమెరికాయే విజయం సాధిస్తుందని వారికి తెలుసు' అని అన్నారు. సుంకాలను తొలగిస్తే దేశానికి పెను విపత్తు సంభవిస్తుందని, మనల్ని ఆర్థికంగా బలహీనుల్ని చేస్తుందని అంటూ మనం బలంగా ఉండాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద సుంకాలు విధించడాన్ని ఆయన సమర్థించుకున్నారు. అసాధారణమైన ముప్పు ఎదురైనప్పుడు అవసరమైన చర్యలు తీసుకునే అధికారాన్ని ఈ చట్టం దేశాధ్యక్షుడికి కట్టబెట్టింది.

సాత్విక్-చిరాగ్ జోడీకి పతకం ఖాయం

- బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

పారిస్: బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జోడికి పతకం ఖాయమైంది. క్వార్టర్ ఫైనల్లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడి 21-12, 21-19 స్కోరుతో మలేషియాకు చెందిన ఒలింపిక్ మెడలిస్టు జోడి ఆరన్ చియా, సోహ్ వూయి యిక్‌లపై గెలుపొందారు. కేవలం 43 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను ముగించారు. దీంతో సెమీస్‌లోకి ఎంట్రీ ఇచ్చిన భారతజంటకు పతకం ఖాయమైంది. మ్యాచ్ గెలవడం అద్భుతంగా ఉన్నట్లు, 2వ ర్యాంక్ ఆటగాళ్లైన మలేషియా ప్రత్యర్థులపై చాలా సార్లు గట్టి పోటీ ఎదుర్కోవాల్సి వచ్చిందని, అయితే వారిపై గెలవడం నిజంగా సంతోషంగా ఉన్నట్లు చిరాగ్ చెప్పాడు. 2022 ఈవెంట్‌లో సాత్విక్-చిరాగ్ జోడి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

E PROCUREMENT SHORT TENDER NOTICE

NIT No. 21/ MAU61-USI0HB(BG)/12/2025-IFR2 **Dt.29.08.2025.**

__Name of Work:__ "APCRDA-Removal of the existing damaged tensile structure and construction of the MS Structure with GI Sheet roof at Eastern Side entry (Hon'ble Judges Entry) of the Main High Court Building Nelapadu"- **Estimate Cost Rs.15,70,000/-.** The bid can be downloaded on AP e-procurement portal from **01.09.2025 to 04.09.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **04.09.2025 up to 15.00 Hrs,** Technical bid opening **04.09.2025 @16.00Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)

గుడివాడ బ్రాంచి (55340)
10-137, గ్రౌండ్ ఫ్లోర్, ఏలూరు రోడ్డు,
గుడివాడ-521301.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1. శ్రీ గోపు శ్రీ వెంకట శేష రవీంద్ర బాబు (లేట్) గారి చట్టరిత్య వారసులు శ్రీమతి గోపు అరుణ కుమారి, భర్త: శ్రీ జి.వెంకట శేష రవీంద్ర బాబు, కేరాఫ్: శ్రీ నివాస్ ప్రసాద్ బల్లా, డి.నెం.1-3-25-5/7ఏ, విద్యాధరపురం, విజయవాడ, కృష్ణాజిల్లా, ఏపి-520012. **2. కుమారి గోపు పవిత్ర యొక్క సహజ సంరక్షకురాలు శ్రీమతి గోపు అరుణ కుమారి,** శ్రీ గోపు శ్రీ వెంకట శేష రవీంద్ర బాబు (లేట్) గారి చట్టరిత్య వారసులు కేరాఫ్: శ్రీ నివాస్ ప్రసాద్ బల్లా, డి.నెం.1-3-25-5/7ఏ, విద్యాధరపురం, విజయవాడ, కృష్ణాజిల్లా, ఏపి-520012. **3. కుమారి గోపు వైష్ణవి యొక్క సహజ సంరక్షకురాలు శ్రీమతి గోపు అరుణ కుమారి,** శ్రీ గోపు శ్రీ వెంకట శేష రవీంద్ర బాబు (లేట్) గారి చట్టరిత్య వారసులు కేరాఫ్: శ్రీ నివాస్ ప్రసాద్ బల్లా, డి.నెం.1-3-25-5/ 7ఏ, విద్యాధరపురం, విజయవాడ, కృష్ణాజిల్లా, ఏపి-520012. **4. శ్రీ సూర్రేవు కృష్ణ కిషోర్,** తండ్రి: ఎస్.అనంత సుబ్బ రంగయ్య, డి.నెం.12/116-3, జోగన్నవీధి, వార్డు 12-14, గుడివాడ (మండలం), కృష్ణాజిల్లా, ఏపి-521301.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, (చట్టం 54 ఆఫ్ 2002) ఇకపై SARFAESI యాక్ట్ 8(6) హెచ్చరిక నోటీసు ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుడివాడ బ్రాంచి (55340) వారికి మీకు చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.02-02-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది. 18-04-2023** న అధీకృత అధికారి లాంఛనాత్మకంగా స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గుడివాడ బ్రాంచి (55340)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఈ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. దిగువ పేర్కొన్న ఆస్తి విక్రయానికి నిర్ణయించిన **రిజర్వ్ ధర రూ.9,54,000/- (అక్షరాలా తొమ్మిది లక్షల యాభై నాలుగు వేల రూపాయలు మాత్రమే).**

పేర్కొన్న ఆస్తిని కొనుగోలు చేయడానికి బిడ్డర్ ఎవరూ ముందుకు రాకపోతే మా బ్యాంక్ రికవరీ పాలసీ మార్గదర్శకాల ప్రకారం ఈ-వేలం జరిగిన ప్రతిసారి రిజర్వ్ ధర తగ్గించబడుతుంది అని దయచేసి గమనించగలరు.

విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది.

1.	పంద్రకుల వెంకట బంగారు సాంబశివరావు/ పంద్రకుల బాబా దుర్గా మల్లికార్జునరావు/ LBGTR00005594957/ LBGTR00005594962	షెడ్యూల్ : నరసరావుపేట రిజిస్ట్రేషన్ డివిజన్, ఫిరంగిపురం సబ్ డివిజన్ కార్యాలయం, అమనాబాద్ గ్రామ పంచాయతీ ఏరియా అమనాబాద్ గ్రామం, మాగంటి రామారావు మరియు ఇతరుల నుండి తేది 18.04.1983న కొనుగోలు చేసిన నా సొంత, శ్రీ ఫిరంగిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బుక్ నం.203 వాల్యూమ్ : 206 నుండి 207 పేజీలు, సం॥ 1983 రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.546 ఉన్న సంపూర్ణమైన హక్కులు అమనాబాద్ గ్రామం డో.నం.466-బి, ఎ.లు.3-28 సెంట్లు., తూర్పు : షేక్ మహమ్మద్ స్థలం 30 అ.లు., దక్షిణం : కొండా రామారావుకు అమ్మబడిన స్థలం 47 అ.లు., పడమర : బజారు కొరకు నేను వదిలిన భూమి 18 అ.లు., ఉత్తరం : నాకు చెందిన స్థలం 47 అ.లు. యాక్ట్ 9/77 ప్రకారం మీకు అమ్మబడినఖాళీ స్థలం ఈ సరిహద్దుల మధ్య 156 2/3 చ.గ.లు. లేదా 141 చ.మీ.లు. ఇది అసైన్డ్ భూమి కాదు లేదా ప్రభుత్వ భూమి కాదు/ లాంఛనప్రాయ స్వాధీనత 25.08.2025	08.05.2025 Rs. 8,35,533.00/-	గుంటూరు

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్స్ 8 మరియు 9 క్రింద నిబంధనల ప్రకారం ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరిన తర్వాత తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 30 అగస్టు, 2025 — **అధీకృత సెక్రెటరీ**
ప్రదేశం : గుంటూరు — **ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున**

మెహుల్ ఛోక్సీ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి (పిఎన్‌బి) వేల కోట్ల రూపాయలను రుణాల ద్వారా తీసుకుని.. ఎగ్గొట్టి బెల్జియంలో తలదాచుకున్న వజ్రాల వ్యాపారి మెహుల్ ఛోక్సీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఆ దేశంలో కోర్టు మరోసారి తిరస్కరించింది. గతంలో తన అరెస్టుని బెల్జియం కోర్టులో ఛోక్సీ సవాల్ చేయగా..న్యాయస్థానం తిరస్కరించింది. తాజాగా మరోసారి కోర్టును ఆశ్రయించారు. అయితే, న్యాయస్థానంలో అతడికి మళ్లీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ నెల 22న అతను కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌లో అతడు తన నివాసంలో ఉంటూ అధికారుల నిఘాలో ఉండడానికి అనుమతించాలని అభ్యర్థించగా .. ఆగస్టు 26న విచారణ చేపట్టిన ధర్మాసనం ఛోక్సీ బెయిల్‌ను తిరస్కరించిందని సంబంధిత అధికారి పేర్కొన్నారు. అతడికి బెయిల్ మంజూరు చేస్తే సులభంగా ఇతర దేశాలకు పారిపోయే అవకాశం ఉందని భారత్ బెల్జియం కోర్టులో పేర్కొన్నట్లు కూడా తెలిపారు. ఛోక్సీని తమకు అప్పగించాలంటూ సిబిఐ, ఇడి చేసిన అభ్యర్థనతో ఛోక్సీని ఏప్రిల్ 11న ఆంట్వెర్ప్ పోలీసులు అరెస్టు చేశారు. దాంతో నాలుగు నెలలకు పైగా అక్కడి జైలులోనే ఉన్నారు. ఛోక్సీ , అతని కంపెనీలకు సంబంధించిన అదనపు సమాచారాన్ని, ఆధారాలను అందించడానికి సిబిఐ కిందటి నెలలో ఆంట్వెర్ప్‌కు వెళ్లింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ (కేసులో మరో ప్రధాన నిందితుడు) దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ఛోక్సీ బెల్జియం పౌరసత్వం తీసుకున్నాడని గత నెల అక్కడి ప్రభుత్వం ధ్రువీకరించింది.

ఎగుమతుల సాకుతో పత్తి రైతుల లూటీ వద్దు

1-3 తేదీల్లో పత్తి టారిఫ్ మినహాయింపు నోటిఫికేషన్లను దగ్ధం చేయండి

- అన్ని శాఖలకు ఎఐకెఎస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : అమెరికాకు జౌళి ఎగుమతుల సాకుతో 60 లక్షల మంది పత్తి రైతులను కార్పొరేట్లు లూటీ చేయడానికి మోడీ ప్రభుత్వం అనుమతిస్తోందని అఖిల భారత కిసాన్ సభ విమర్శించింది. ఈ పరిస్థితుల్లో ఎస్‌కెఎం పిలుపిచ్చినట్లుగా సెప్టెంబరు 1-3 తేదీల్లో గ్రామాల్లో పత్తి టారిఫ్ మినహాయింపు నోటిఫికేషన్లను దగ్ధం చేయాల్సిందిగా ఎఐకెఎస్ విజ్ఞప్తి చేసింది. అలాగే పత్తి పండే ప్రాంతాల్లో పార్లమెంట్ సభ్యుల కార్యాలయాలకు ప్రదర్శనలు నిర్వహించాల్సిందిగా కూడా కోరింది.

పత్తి దిగుమతులకు డిసెంబరు 31వరకు సుంకాల మినహాయింపును ఆర్థిక శాఖ పొడిగించింది.ఈ మేరకు ఆగస్టు 28న ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తంగా దేశ జౌళి ఎగుమతుల్లో కేవలం ఆరు శాతం మాత్రమే అమెరికాకు ఎగుమతి అవుతాయి. మొత్తంగా జౌళి పరిశ్రమ విలువతో పోల్చుకుంటే 10.5శాతం కన్నా తక్కువగానే వుంటుంది. గతేడాదిలో దేశంలో జౌళి, దుస్తుల పరిశ్రమ మార్కెట్ విలువ రూ.15,13,850కోట్లు కాగా, అందులో రూ.12,34,400 కోట్ల వ్యాపారం దేశీయ మార్కెట్ నుండే వచ్చింది. ఎగుమతి మార్కెట్ విలువ కేవలం రూ.3,21,900కోట్లుగా వుంది. దాంట్లో మళ్లీ అమెరికా ఎగుమతులు గతేడాది కేవలం రూ.20,984 కోట్లు మాత్రమే. అయినా భారత్‌పై అమెరికా 50శాతం టారిఫ్‌లు విధించిన కారణంగా జౌళి ఎగుమతి రంగంలో సంక్షోభం నెలకొందన్న సాకుతో మోడీప్రభుత్వం పత్తి దేశీయ ధరలను తగ్గించేందుకు గానూ దిగుమతులపై జీరో శాతం టారిఫ్‌తో కార్పొరేట్ కంపెనీల గుత్తాధిపత్యానికి అనుమతించింది. దీనివల్ల 60లక్షల మంది పత్తి రైతులు దోపిడీకి గురవుతారని ఎఐకెఎస్ విమర్శించింది. వారు ఇప్పటికే తీవ్రమైన దుస్థితిని ఎదుర్కొంటూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్షుడు అశోక్ ధావలె, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు.

అమెరికా ఎగుమతుల్లో 6శాతం అంతరాన్ని తట్టుకుని నిలబడే సామర్థ్యం భారత దేశీయ ఆర్థిక వ్యవస్థకు వుంది. ఈ ఎగుమతి సంక్షోభాన్ని అధిగమించేందుకు అన్వేషించే మార్గాల్లో ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం కూడా ఒక అవకాశం. ఈ దిశగా రైతులకు ప్రోత్సాహక ధరలు, కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చేలా అవసరమైన విధానాలు రూపొందించడం అవసరం. ఆ విధానాలు క్రియాశీలమైన దేశీయ మార్కెట్‌కు, అలాగే ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడేందుకు చాలా అవసరం. చిన్న, మధ్య తరహా సంస్థలకు పత్తిని చవకగా, సబ్సిడీరేట్లకు సరఫరా చేసి దేశీయ వాణిజ్యాన్ని పెంచడంతో పాటూ ఎగుమతి మార్కెట్‌లో పోటీ పడేలా చేయడాల్సిన అవసరం వుంది. కాని దానికి బదులుగా, కార్పొరేట్ కంపెనీలు జౌళి రంగం పెంపు పేరుతో, లాభార్జనే ధ్యేయంగా చవక దిగుమతులను అనుమతిస్తూ పత్తి రైతులను దెబ్బ తీస్తున్నాయని ఎఐకెఎస్ విమర్శించింది.

ఈ పరిస్థితుల్లో రైతులు ఐక్యంగా నిలబడి, ఇటువంటి రైతు వ్యతిరేక నిర్ణయాలను ఎంత మాత్రమూ సహించేది లేదని స్పష్టం చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో అమెరికా ఒత్తిడికి మోడీ ప్రభుత్వం తలొంచుతుందని, ఇతర పంటలకు కూడా ఇలాంటి నిర్ణయాలే తీసుకుంటుందని విమర్శించారు. గత 11ఏళ్లలో దేశంలో పత్తి ఉత్పత్తి గణనీయం గా క్షీణించింది. 2014-15లో 65.6 లక్షల మెట్రిక్ టన్నులుండగా, 2023-24 నాటికి అదికేవలం 55 లక్షలకు పడిపోయింది. కనీస మద్దతు ధర ఇవ్వకపోవడం వల్ల 60లక్షల మంది పత్తి రైతులు గతేడాది నష్టపోయిన మొత్తం రూ.18,850కోట్లుగా వుంటుందని అంచనా. ఇటువంటి పరిస్థితుల్లో పత్తి దిగుమతులపై 11శాతం టారిఫ్‌కు స్వస్తి చెప్పడానికి అనుమతిస్తున్న నోటిఫికేషన్‌ను రద్దు చేయాల్సిందిగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆందోళనను ఉధృతం చేయాలని అన్ని శాఖలకు ఎఐకెఎస్ పిలుపిచ్చింది. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపిచ్చిన మేరకు సెప్టెంబరు 1-3 తేదీల్లో గ్రామాల్లో నోటిఫికేషన్ కాపీలను దగ్ధం చేయాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేసింది. అలాగే రాష్ట్ర స్థాయిలో ఎస్‌కెఎం నాయకత్వం పిలుపిచ్చిన మేరకు పత్తి పండే ప్రాంతాల్లో పార్లమెంట్ సభ్యుల కార్యాలయాలకు ప్రదర్శనలు నిర్వహించాల్సిందిగా కూడా రైతులకు విజ్ఞప్తి చేసింది.

బీహార్‌లోని నౌతన్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి సిపిఎం పోటీ

న్యూఢిల్లీ : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నౌతన్ అసెంబ్లీ నుండి సిపిఎం పోటీ చేయనుంది. చంపారన్ ఉత్తర్ భవన్‌లో ఈ నెల 29న జరిగిన సిపిఐ(ఎం) నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. ఈ సమావేశానికి సిపిఎం నేత ప్రకాష్ కుమార్ వర్మ అధ్యక్షత వహించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలె సమావేశంలో కీలకోపన్యాసం చేశారు. దేశంలో మనువృత్తిని అమలు చేయాలని, మతం ప్రాతిపదికన విద్వేష వాతావరణాన్ని, ఉద్రిక్తతలను పెంచుతూ, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా పక్కన నెట్టాలన్నది మోడీ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని విమర్శించారు. ఈ దేశ సంస్కృతి, నాగరికతలను రక్షించుకోవాలంటే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని, బీహార్ డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని ఓడించాల్సి వుందని పిలుపిచ్చారు.

కేరళ సిఎం విజయన్‌పై అభ్యంతరకర పోస్టు

- నిందితుడు అరెస్టు

కోచి : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై అభ్యంతరకర వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు వివాదాస్పద జర్నలిస్టు, క్రైమ్ నందకుమార్‌గా పేరొందిన టి.పి.నందకుమార్‌పై కేసు నమోదు చేశారు. కొచ్చిలోని మంకవ్ నివాసి అయిన నందకుమార్‌పై ఎర్నాకుళం నగర సైబర్ క్రైమ్ పోలీసులు భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 192 కింద, అలాగే అభ్యంతరకర సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ప్రచురించినా లేదా ప్రసారం చేసినా అందుకు సంబంధించిన నేరాలను పరిశీలించే ఐటి చట్టంలోని సెక్షన్ 67, 67(ఎ)ల కింద శుక్రవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితుడు తన 'ఫేస్‌బుక్ పేజీలో, యూట్యూబ్ చానెల్‌లో ఒక అసభ్యకరమైన వీడియోను పోస్టు చేశాడని ఎఫ్ఐఆర్ పేర్కొంది. సైబర్ గస్తీ సమయంలో సంఘవ్యతిరేకమైన కంటెంట్‌ను ప్రమేయమున్న ఒక వివాదాస్పద మహిళతో ముఖ్యమంత్రికి ముడి పెడుతూ క్యాప్షన్ ఇచ్చాడని పోలీసులు తెలిపారు. గతంలో కూడా ఇదే తరహాలో నందకుమార్‌పై అప్రతిష్టాకరమైన కేసులు నమోదయ్యాయి. 2022 డిసెంబరులో ఎర్నాకుళం నార్త్ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. సిల్వర్‌లైన్ సెమీ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టుతో ముడిపెడుతూ ముఖ్యమంత్రి విజయన్‌పై సోషల్ మీడియాలో అప్రతిష్టకరమైన పోస్టు పెట్టినందుకు ఈ కేసు నమోదైంది.

ఓట్ల చోరీ వెనుక ఆ ముగ్గురు..

- బీహార్ ర్యాలీలో రాహుల్ గాంధీ
- ర్యాలీలో పాల్గొన్న అఖిలేశ్ యాదవ్

ఆరా: బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఆరోపించారు. బీహార్‌లో ఓటర్ అధికార్ యాత్రలో భాగంగా శనివారం ఆరాలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కలిసి రాహుల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. బీహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిపిన దాడిగా విమర్శించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బీహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందన్నారు. ఓటు అనేది దళితులు, మైనారిటీలు, మహిళలకు ఒక హక్కు అని రాహుల్ గాంధీ అన్నారు. భారత రాజ్యాంగం ఓటు హక్కును హామీని ఇస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుని ప్రజల ఓటు హక్కును తొలగించడం ద్వారా బిజెపి రాజ్యాంగంపై దాడి చేస్తోందని విమర్శించారు.

'బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపుతారు'

ఈ యాత్రలో పాల్గొన్న అఖిలేశ్ యాదవ్, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పచ్చి బూటకపు నిర్ణయంగా అభివర్ణించారు. 'బిజెపికి రోజులు ముగిశాయి. ప్రజలు ఆ ప్రభుత్వాన్ని గద్దె దింపుతారు. దీనికి బీహార్ ఎన్నిక కీలకం కానున్నాయి. దేశం మొత్తం దీనిని గమనిస్తోంది. ప్రజలను వాడుకుని నాశనం చేసే పార్టీ బిజెపి. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని ఆశించాం. కానీ అది ఇప్పుడు బిజెపి జుగాడ్ కమిషన్‌గా మారిపోయింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాల్లో బీజేపీ కేవలం 33 సీట్లు మాత్రమే గెలిచింది. అవధ్ (ఉత్తరప్రదేశ్ పాత పేరు) ప్రజలు ఇప్పటికే బీజేపీని గద్దె దించారు. ఇప్పుడు మగధ్ (బీహార్ పాత పేరు) ప్రజల వంతు వచ్చింది" అని అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. కాగా, ఇక జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఇతర మిత్ర పక్షాల ప్రతినిధులు, టిఎంసి నుంచి మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, లలితేశ్ త్రిపాఠి సెప్టెంబర్ 1న జరిగే యాత్ర చివరి రోజు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఢిల్లీలో ఒక్కరైనా సురక్షితంగా ఉన్నారా? : కేజ్రీవాల్

న్యూఢిల్లీ : ఢిల్లీలోని కల్కాజీ ఆలయంలోని సేవకుడు దారుణ హత్య ఘటనపై ఆ రాష్ట్ర మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అసలు ఢిల్లీలో ఒక్కరైనా సురక్షితంగా ఉన్నారా? అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఆలయంలో యోగేంద్ర సింగ్ అనే సేవకుడిని హత్య చేసేముందు ఆ దుర్మార్గుల చేతుల వణకలేదా? అని ఆయన ప్రశ్నించారు. ఇది శాంతి భద్రతల వైఫల్యం కాకపోతే మరేమిటి అని ఆయన ఎక్స్ పోస్టులో బిజెపి ప్రభుత్వాన్ని నిలదీశారు. బిజెపి నాలుగు ఇంజన్లు ఢిల్లీని ఇంతటి స్థితికి తీసుకువచ్చాయి. ఇప్పుడు దేవాలయాల్లో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీలో ఎవరైనా సురక్షితంగా ఉన్నారా? లేదా అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ సేవకుడి పేరు

అలాగే, ఢిల్లీలో పరిస్థితి రోజురోజుకీ దిగజారుతోంది అని ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ అన్నారు. రాష్ట్రంలోని పోలీసులు రాజకీయ పనులతో బిజీగా ఉన్నారు. పోలీసులు చట్టాలను గౌరవించే ప్రజలను బెదిరిస్తారు. దొంగలు, గూండాలు, గ్యాంగ్‌స్టర్లకు పోలీసులంటే అస్సలు భయం ఉండదు. డబ్బుతోనే ప్రతిదాన్ని నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నారు.

సమాఖ్య విధానం బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

ఎం. నాగనాథన్ ఆ కమిటీలో ప్యానెల్ సభ్యులుగా ఉన్నారని స్టాలిన్ తెలిపారు.

వివరణాత్మక ప్రతిస్పందనలను ఇవ్వండి!

ఆ కమిటీ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అభిప్రాయాలను సేకరించడానికి ఒక ఆన్‌లైన్ ప్రశ్నాపత్రాన్ని సిద్ధం చేసిందని స్టాలిన్ వెల్లడించారు. ఆగస్టు 23వ తేదీన కేంద్రం- రాష్ట్ర సంబంధాలపై జరిగిన సెమినార్‌లో ఆయన దీనిని ప్రారంభించారు. ముఖ్యమంత్రులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత శ్రద్ధ వహించాలని, సంబంధిత విభాగాలు ప్రశ్నాపత్రాన్ని పరిశీలించి వివరణాత్మక ప్రతిస్పందనలను అందించాలని ఆయన కోరారు.

క్రియాశీల భాగస్వామ్యం అమూల్యమైనది

అన్ని రాష్ట్రాల సమష్టి సంకల్పాన్ని ప్రతిబింబించే పత్రాన్ని రూపొందించడంలో, దేశ సమాఖ్య పునాదులను బలోపేతం చేయడంలో క్రియాశీల భాగస్వామ్యం అమూల్యమైనదని స్టాలిన్ అన్నారు. అటువంటి ప్రయత్నం రాజకీయాలు, పక్షపాతానికి అతీతంగా ఉంటుందని తమిళనాడు ముఖ్యమంత్రి తెలిపారు. అంతా కలిసి, మన రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తిని పునరుద్ధరించుకుందామని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు బలమైన, న్యాయమైన, సమాఖ్యమైన ఐక్యతను అందిద్దామని చెప్పారు.

ఏడేళ్ల తర్వాత చైనా గడ్డపై!

(మొదటి పేజీ తరువాయి)

వ్లాదిమిర్ పుతిన్ సహా పలువురు నేతలతో మోడీ ద్వైపాక్ష చర్చలు జరుపుతారని భావిస్తున్నారు. జపాన్‌లో రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని తియాన్‌జిన్ చేరుకున్నారు. ఈ పర్యటనకు ముందు ప్రధాని మోడీ మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక సుస్థిరతను తీసుకురావడానికి భారత్, చైనాలు కలిసి కృషి చేయడం చాలా ముఖ్యమని జపాన్‌లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ సందర్భంగా వ్యాఖ్యానించారు. భారత్, చైనాల మధ్య సుస్థిరమైన, సామరస్యమైన ద్వైపాక్షిక సంబంధాలు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, సంక్షేమాలపై సానుకూల ప్రభావాన్ని కనబరుస్తాయని అన్నారు.

ఇజ్రాయిల్ దాడిలో హౌతీ యెమెన్ ప్రధాని మృతి..

సనా : ఇజ్రాయిల్ దళాల దాడిలో యెమెన్ హౌతీ ప్రధాన మంత్రి అహ్మద్ అల్ రహానీ మృతి చెందారు. రాజదాని సనాలో ప్రధానితో పాటు మంత్రులు ప్రభుత్వ కార్యకలాపాలను సమీక్షిస్తున్న సమయంలో ఇజ్రాయిల్ వైమానిక దాడి చేసిందని, దీనిలో అహ్మద్ అల్ రహానీతో పాటు పలువురు మంత్రులు మృతి చెందారని హౌతీ సుప్రీం పొలిటికల్ అధిపతి అల్ మషత్ శనివారం ప్రకటించారు.. యెమెన్‌లో హౌతీల నియంత్రనలోని ప్రభుత్వానికి అహ్మద్ అల్ రహానీ 2024 నుండి ప్రధానిగా పని చేస్తున్నారు.. పాలస్తీనాకు మద్దతుగా హౌతీలు పోరాడుతున్నారు. ఇజ్రాయిల్‌ను నియంత్రించడానికి ఎర్ర సముద్రంలో ఆ దేశానికి సంభందించిన నౌకలపై దాడులు చేస్తుంది. ఈ దాడులు ఇజ్రాయిల్‌ను ఆర్థికంగా దెబ్బతీస్తుంది. దీంతో హౌతీల నియంత్రనలోని ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ కేంద్రాలు, ఓడ రేవులపై ఫైటర్ జెట్ విమానాలతో ఇజ్రాయిల్ దాడులు చేస్తుంది. అయితే గాజాపై దాడులు ఆగేంతవరకు తమ పోరాటం కొనసాగుతుందని హౌతీలు ప్రకటించారు.

ప్రపంచ నేతల రాకతో బీజింగ్ బిజీ బిజీ

ఎస్‌సిఓ సదస్సు, సైనిక పెరేడ్‌కు సర్వం సిద్ధం

తైపీ : ప్రపంచ దేశాలకు చెందిన సుమారు పాతిక మంది నేతలకు బీజింగ్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) వార్షిక సదస్సు. రెండో ప్రపంచ యుద్ధం ముగింపు 80వ వార్షికోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున నిర్వహించే సైనిక పెరేడ్. ఈ కార్యక్రమాలలో భాగస్వాములయ్యేందుకు రష్యా, ఉత్తర కొరియా నేతలతో పాటు ఆగ్నేయాసియా, మధ్య ఆసియా ప్రాంతాలలోని పలు దేశాల అధినేతలు కూడా బీజింగ్‌కు తరలి వస్తున్నారు.

ఆది, సోమ వారాలలో జరిగే ఎస్‌సిఒ సదస్సుకు హాజరయ్యేందుకు పలువురు నేతలు ఇప్పటికే బీజింగ్‌కు ఆగ్నేయంగా ఉన్న తియంజిన్‌కు చేరుకున్నారు. ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటానియో గుటెరస్, ఈజిప్ట్ ప్రధాని ముస్తఫాలతో సహ వచ్చిన ప్రపంచ నేతలకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సాదరంగా స్వాగతం పలికారు.

అంటోనియా గుటెర్రెస్‌కు స్వాగతం పలుకుతున్న జిన్‌పింగ్

బుధవారం నాడు బీజింగ్‌లో భారీ సైనిక పెరేడ్ జరగబోతోంది. చైనాలో దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన అత్యాధునిక ఆయుధాల ప్రదర్శనకు ఇది వేదిక కాబోతోంది. వీటిలో వందకు పైగా యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకులు, క్షిపణులు ఉన్నాయి. ఎస్‌సిఓలోని పది సభ్య దేశాల నేతలతో పాటు మరో పాతిక దేశాల ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారు. ఈ దేశాలలో కొన్ని త్వరలోనే ఎస్‌ఓసీ గ్రూపులో చేరబోతున్నాయి. చైనా, రష్యా, కజక్‌స్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్ దేశాలు ఎస్‌ఓసీని ఏర్పాటు చేయగా భారత్, ఇరాన్, పాకిస్తాన్, బెలారస్ దేశాలు ఆ తర్వాతి కాలంలో అందులో చేరాయి. ఆఫ్ఘనిస్తాన్, మంగోలియాలు పరిశీలక దేశాలుగా కొనసాగుతున్నాయి. ఆగ్నేయాసియా, మధ్య ఆసియాకు చెందిన మరో 14 దేశాలు 'చర్చల భాగస్వాములు'గా వ్యవహరిస్తున్నాయి. ఈ సదస్సుకు హాజరవుతున్న ప్రముఖుల జాబితాలో ప్రధాని నరేంద్ర మోడీ, రష్యా, ఇరాన్ అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్, మసూద్ పెజెష్కియాన్ ఉన్నారు. చర్చల భాగస్వాములుగా కొనసాగుతున్న దేశాల నుంచి టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్, ఈజిప్ట్ ప్రధాని ముస్తాఫా మద్‌బౌలీ కూడా హాజరవుతున్నారు. ఎస్‌ఓసీలో సభ్యులు కాకపోయినా ఇండోనేషియా, లావోస్, మలేసియా, వియత్నాం దేశాలు కూడా ఇందులో పాల్గొంటున్నాయి. కాగా సైనిక పెరేడ్‌కు ముందే భారత్, ఈజిప్ట్, టర్కీ దేశాల నేతలు బీజింగ్ నుంచి స్వదేశాలకు బయలుదేరతారు. ఉత్తర కొరియా నేత కిమ్ జాంగ్ ఉన్ మాత్రం సైనిక విన్యాసాలను వీక్షిస్తారు. మయన్మార్ జుంటా అధినేత, దేశ తాత్కాలిక అధ్యక్షుడు మిన్ అంగ్ హ్లేయింగ్, క్యూబా అధ్యక్షుడు మిగుయిల్ దియాజ్-కానెల్‌తో పాటు డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, జింబాబ్వే నేతలు కూడా పెరేడ్‌కు హాజరవుతారు. వీరితో పాటు సెర్బియా అధ్యక్షుడు అలగ్జాండర్ వ్యూసిస్, స్లొవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో సైనిక విన్యాసాలను తిలకిస్తారు.

రాయలసీమను అగ్రసీమ చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పెన్నా నది వరకూ అనుసంధానం చేయగలిగితే కరువు అనేది ఉండదన్నారు. నదుల అనుసంధానం ఉపయోగాన్ని తెలంగాణా నేతలు తెలుసుకోవాలని సూచించారు. వైసిపి విషవృక్షంగా తయారైందని, ఏ మంచి పని చేస్తున్నా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో రోడ్లు, ఎయిర్ పోర్టులకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు.

పరమసముద్రం గ్రామంలో కృష్ణా జలాలకు జలహారతి ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

'స్త్రీశక్తి' వల్ల ఆటో డ్రైవర్లకు నష్టం రాదు

జలహారతికి హాజరైన చంద్రబాబు కుప్పం బ్రాంచి కెనాల్ వరకూ 'స్త్రీశక్తి' బస్సు ఎక్కి సందడి చేశారు. మహిళలు, రైతులతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు ఎలాంటి నష్టమూ రాదన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం గురించి ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను అమలు చేసి ఆదుకుంటామన్నారు. మెగా డిఎస్‌సి ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామని, కుప్పం నుంచి 50 మంది టీచర్లు ఎంపికయ్యారని తెలిపారు. కుప్పం నియోజకవర్గానికి ఒకప్పుడు టీచర్లే వచ్చేవారు కాదని, ట్రాన్స్‌ఫర్లు చేయించుకుని వెళ్లిపోయేవారని, ఇప్పుడు కుప్పం యువతీయువకులే టీచర్లయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి శ్రీకాంత్, పలమనేరు ఎంఎల్‌ఎ అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద గోదావరి

(మొదటి పేజీ తరువాయి)

గ్రామంలోకి, వడ్డిగూడెం కాలనీకి వరద నీరు చేరింది. రామవరం, అడివి వెంకన్నగూడెం, రామవరంపాడు, తుష్టివారిగూడెం, చింత రేగుపల్లి, కన్నాయిగూడెం, జీడిగుప్ప, కొటారు గొమ్ము తదితర గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో వారి అవసరాలకు పడవను వినియోగిస్తున్నారు. ముంపు భయంతో పలువురు ఇప్పటికే ఎత్తైన గుట్టలపై గుడారాలు, పాకలు ఏర్పాటు చేసుకుని అక్కడే ఉంటున్నారు. ఇంకొందరు రేఖపల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి మూటాముల్లె సర్దుకుని తరలివెళ్లారు.

గోదావరి వరద ముంపులో విఆర్.పురం మండలంలోని వడ్డి గూడెం కాలనీ

కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద కూడా క్రమంగా నీటిమట్టం పెరుగుతోంది. ఇక్కడ 11.80 అడుగుల నీటిమట్టం నమోదైంది. మొదటి ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. బ్యారేజీ 175 గేట్లను పైకిలేపి 10,01,410 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలకు 10,200 క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. ఒకటి రెండు రోజులు ఇదే తరహాలో ప్రవాహం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రవాహం మరింత పెరిగితే లంకలు మునిగిపోయే ప్రమాదం ఉంది.

ఏలూరు జిల్లాలో పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ఏలూరు జిల్లాలోని ముత్యాలంపాడు, వింజరం మధ్య పాలవాగు కాజ్‌వేపైకి వరద నీరు చేరడంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ప్రభావంతో వేలేరుపాడు నుంచి రుద్రంకోట వెళ్లే రహదారి, వసంతవాడ మీదుగా వెళ్లే రహదారి కూడా నీట మునగడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కోయిదా వెళ్లే మార్గంలో నాళ్లవరం దగ్గర రహదారులు నీట మునగడంతో కొత్తూరు, బోళ్లపల్లి, చిగురుమామిడి, ఎద్దు వాగు కాజ్‌వే మునగడంతో సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వశిష్ట గోదావరికి వరద క్రమంగా పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరు వద్ద రెండు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. కరుగోరుమిల్లి వద్ద పుష్కరఘాట్ పూర్తిగా నీట మునిగింది. యలమంచిలి మండలం కనకాయలంక గ్రామస్తులకు ప్రధాన మార్గమైన కాజ్‌వే మరలా వరద నీటిలో చిక్కుకుంది.

జమ్మూకాశ్మీర్‌ను వీడని కుంభవృష్టి

- కొండచరియలు విరిగిపడి 11 మంది మృతి

కొండచరియలు విరిగిపడి ధ్వంసమైన ఇళ్ల వద్ద బాధితులు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌ను భారీ వర్షాలు వీడడం లేదు. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు జమ్మూకాశ్మీర్ అల్లాడుతోంది. భారీ వర్షాలకు వరదలు, కొండచరియలు విరిగపడ్డం వంటి ఘటనలతో ఈ ప్రాంతం అల్లకొల్లంగా మారింది. శనివారం రియాసి, రాంబన్ జిల్లాల్లో కొండచరియలు విరిగిపడి 11 మంది మరణించారు. దీంతో ఇటీవల కాలంలో జమ్మూకాశ్మీర్‌లో వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 130కు చేరుకుంది. 140 మంది గాయపడ్డారు. మరో 32 మంది గల్లంతయ్యారు.

శనివారం రాంబన్ జిల్లాలోని రాజ్‌గర్‌లో భారీ వర్షాలకు వరదలు ముంచెత్తాయి. నలుగురు గ్రామస్థులు మరణించగా, మరి కొందరి ఆచూకీ తెలియడం లేదు. రెండు ఇళ్లు, ఓ పాఠశాల భవనం వరద నీటిలో కొట్టుకుపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సహాయ, పునరావాస చర్యలు చేపట్టారు. ఐదుగురు వ్యక్తుల జాడ తెలియడం లేదని, వారి కోసం ఆగాలిస్తున్నామని అధికారులు చెప్పారు. వరద ప్రవాహం కారణంగా ఆస్తి నష్టం కూడా సంభవించిందని తెలిపారు.

శనివారం జరిగిన మరో ఘటనలో రియాసి జిల్లాలోని మాహోర్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. బద్దర్ గ్రామంలో ఒక ఇల్లు నామరూపాలు లేకుండా పోయింది. ఈ సంఘటనలో ఏడుగురు మరణించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. మృతుల్లో దంపతులు, వారి ఐదుగురు పిల్లలు ఉన్నారు. చిన్నారులంతా 12 సంవత్సరాల లోపు వయసు వారే. కాగా, మరోవైపు మరికొన్ని రోజుల పాటు పూంఛ్, కిశ్త్‌వాడ్, జమ్మూ, రాంబాన్, ఉధంపూర్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతవరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున అలాంటి ప్రదేశాలకు దూరంగా వెళ్లాలని కోరింది.

భారీ వర్షాల కారణంగా జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై వాహనాలు రాకపోకలను వరుసగా ఐదో రోజు కూడా నిలిపివేశారు. కొండచరియలు విరిగిపడడంతో ఉధంపూర్, బనిహాల్ మధ్య అనేక చోట్ల రోడ్డు దెబ్బతింది.

భారీ వర్షాలతో అల్లాడుతున్న జమ్మూకాశ్మీర్‌కు కేంద్ర ప్రభుత్వం సహాయ ప్యాకేజీ ప్రకటించాలని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ శనివారం విజ్ఞప్తి చేశారు. 'కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు జమ్మూకాశ్మీర్‌లో విస్తృతమైన విధ్వంసానికి కారణమయ్యాయి. జమ్మూ అత్యంత తీవ్రంగా దెబ్బతింది. అనేక మంది ప్రాణాలను కోల్పోయారు. ఇళ్లు ధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. అనేక కుటుంబాలు ఏమీ లేకుండా నిలిపోయాయి' అని ఎక్స్‌లో ముఫ్తీ తెలిపారు.

ప్రమాదంలో పంటల బీమా

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించలేదు. కొన్నేళ్ల బీమా క్లెయిములు పెండింగ్ పడ్డాయి.

సమగ్రం అన్నారు...

పంటల బీమాలో వైసిపి వైఫల్యం చెందిందని, తామొస్తే సమగ్ర బీమా తెస్తామన్న టిడిపి కూటమి, పలు కసరత్తుల అనంతరం కేంద్ర పథకాలకే జై కొట్టింది.

పైగా ఉచిత పంటల బీమాను ఎత్తేసి, రైతులపై ప్రీమియం భారం మోపింది. గతేడాది రబీ నుంచి కొత్త విధానం అమల్లోకొచ్చింది. నిరుడు ఖరీఫ్‌లో మాత్రం ఉచిత పంటల బీమాను అమలు చేసింది. వైసిపి ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలను కంపెనీలకు చెల్లించి, రైతులకు బీమా సొమ్ము ఇప్పిస్తామనగా గత ప్రభుత్వంలో పెండింగ్ పడ్డ బకాయిలను ఇప్పటికీ చెల్లించలేదు. 2022 రబీ, 2023 ఖరీఫ్, 2023 రబీ బీమా నయాపైసా రైతుకు రాలేదు. కూటమి సర్కారు వచ్చాక 2024 ఖరీఫ్‌లో భారీ వర్షాలు, వరదలొచ్చినా, కొన్ని మండలాల్లో కరువొచ్చినా నేటికీ రైతుకు బీమా రాలేదు. 2024-25 రబీదీ అదే దారి.

భారీ తగ్గుదల

2024 ఖరీఫ్‌లో కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమా అమలు చేయడంతో నిరుడు ఫసల్‌లో 24.05 లక్షల మంది రైతులు 51.55 లక్షల ఎకరాల్లో వేసిన తమ పంటలకు బీమా చేయించుకున్నారు. వెదర్ బేస్డ్ కింద 8 లక్షల మంది రైతులు 19.17 లక్షల ఎకరాల్లో పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకున్నారు. 2025 ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమా లేకపోవడం, రైతులు తామే ప్రీమియం చెల్లించాల్సి రావడంతో ఆగస్టు 30 నాటికి ఫసల్‌లో కేవలం 4 లక్షల మంది 7.55 లక్షల ఎకరాలకు బీమా చేయించుకున్నారు. వాతావరణ బీమా కింద 2.95 లక్షల మంది 10.85 లక్షల ఎకరాలకు బీమా చేయించారు. చాలా పంటలకు బీమా గడువు ముగిసింది. మరో నెలలో సీజన్ ముగుస్తుంది. ఈ ధోరణి ఇలానే కొనసాగితే లక్షల మంది రైతులు బీమాకు దూరమవుతారు.

జీవన సౌరభం

మనం సాధించిన విజయాలు సమాజ అభివృద్ధికి ఉపయోగపడినప్పుడే అవి నిజమైన విజయాలౌతాయి.

మీ కోసం

చేపలకు శనగపిండి పట్టించి ఐదు నిమిషాల తరువాత శుభ్రం చేస్తే నీచు వాసన పోతుంది.

కిచెన్ గార్డెన్

ఒకరోజు పాఠశాల ప్రార్థన సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొక్కలు నాటి కిచెన్ గార్డెన్ నిర్వహించాలని విద్యార్థులకు సూచించారు. కిచెన్ గార్డెన్ అంటే ఏమిటో తొమ్మిదో తరగతి విద్యార్థులు తమ క్లాస్ టీచరును అడిగి తెలుసుకున్నారు. వెంటనే పాఠశాలలో ఖాళీ పీరియడ్ సమయంలో ఒకవైపున ఉన్న స్థలంలో శుభ్రం చేశారు. తమ ఇంటి వద్ద ఉన్న చిన్న చిన్న మొక్కలు, గింజలు తెచ్చి క్లాస్ టీచర్ సహాయంతో భూమిలో నాటారు. ప్రతిరోజూ ఇద్దరు చొప్పున వంతులవారీగా వాటికి నీళ్లు పోస్తూ రక్షించారు. నాలుగైదు రోజులలోనే నాటిన గింజలు మొలకెత్తాయి. వాటికి తోడుగా మిరప చెట్లు, బంతినారు అక్కడక్కడ నాటారు.

నెల రోజులకే పచ్చగా ఏపుగా కిచెన్ గార్డెన్ పెరిగింది. విద్యార్థులు ఎంతో అపురూపంగా దాన్ని సంరక్షించారు. తక్కువ కాలంలోనే మిరపకాయలు, బెండకాయలు, వంకాయలు కాశాయి. బంతిపూలు పూశాయి. మొదటిసారిగా ఆ తోటలో కోసిన పూలు, కూరగాయలను పిల్లలు, టీచర్లు పంచుకున్నారు. రెండు నెలల వ్యవధిలోనే పాఠశాల విద్యార్థులకు సరిపోను కూరగాయలు కాశాయి. మధ్యాహ్నం భోజనం కూర వండడానికి సరిపోను కూరగాయలు పాఠశాలలోనే లభ్యం అయ్యాయి. విద్యా సంవత్సరంలో మంచి కిచెన్ గార్డెన్ నిర్వహించినందుకు జిల్లా అధికారులచే విద్యార్థులు ప్రశంసలు పొందారు.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి,
94415 61655.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ రెండు బొమ్మలు ఇచ్చాం. వాటి మధ్య పది తేడాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం..

నేను గీసిన బొమ్మ

జి.రాజేశ్వరి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
మెట్టవలస గ్రామం,
లావేరు మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నీ బిడ్డకు నా పేరు పెట్టు కన్నా ...

కళ్ల ముందే తన దేశం శిథిలమైపోతోందని ఆ యువ జర్నలిస్టు ఎంతో తల్లడిల్లింది. తన ప్రజల దుర్భర పరిస్థితిని, కుప్పకూలిపోతున్న తమ కలల సౌధాలను కెమెరాలో బంధించి తన కళ్లతో ఈ ప్రపంచానికి చూపించింది. యుద్ధం మొదలైనప్పటి నుండి ఆ బాంబుల మోతల మధ్యే ఆమె విధులు నిర్వహించింది. ఈ ప్రయాణంలో తన బిడ్డ సురక్షితంగా ఉండాలని, సమయానికి తిండి తినాలని, నీరు తాగాలని ఎంతో తపించింది. మనసుకు కష్టంగా ఉన్నా సర్దిచెప్పుకుని అబుదాబిలో ఉన్న భర్త చెంతకి బిడ్డని చేర్చింది. బిడ్డ సురక్షితంగా ఉన్నాడన్న ధైర్యంతో రెట్టింపు ఉత్సాహంతో తన విధులు నిర్వహించింది. దేశానికి జరుగుతున్న అన్యాయం గురించి ఎంతో ధైర్యంగా మాట్లాడింది. అయితే ఇప్పుడా తల్లి గొంతు మూగబోయింది. ఆగస్టు 25 సోమవారం గాజాపై ఇజ్రాయిల్ జరిపిన బాంబు దాడిలో అశువులు బాసిన జర్నలిస్టుల్లో మరియం అబు దఖు(32) ఒకరు. యుద్ధ భూమిలో ఆమె ధైర్యసాహసాలని దగ్గర నుండి చూసిన ఆమె సహచరి యౌమ్నా ఎల్సయిద్ మరియం గురించి భావోద్వేగంగా పంచుకున్న విషయాలు ఇవి.

'మరియంని నేను ఎలా గుర్తుంచుకుంటానంటే.. తను ధైర్యవంతురాలైన జర్నలిస్ట్. బలమైన మహిళ. అందరికీ స్నేహితురాలు. ప్రకాశవంతమైన ముఖంతో, ఎప్పుడూ చిరునవ్వు చెరగని నా స్నేహితురాలు మరియం.

యుద్ధ సమయంలో గాజా, దు:ఖం, బాధ, నవ్వు, ప్రేమని ఎలా మిళితం చేసుకుందో చూపించేందుకు తను చేసిన కృషిని నేను గుర్తుంచుకోవాలనుకుంటున్నాను.

కొడుకు ఫైత్‌పై ఆమె పెంచుకున్న మమకారం నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఇంటికి ఆనందాన్ని తెచ్చిన సోదరిగా, తల్లిదండ్రులకు ప్రియమైన కుమార్తెగా ఆమె చేసిన త్యాగం నా జ్ఞాపకాల్లో నుండి ఇకా చెరగలేదు. తండ్రికి కిడ్నీ దానం చేసి, ఒక్క కిడ్నీతోనే, బక్క పల్చని శరీరంతో ముందు వరుసలో నిలబడి నిర్భయంగా వార్తలు సేకరించిన మరియం ఎప్పటికీ నాకు గుర్తే.

అంతా బాగవుతుంది..

చుట్టూ బాంబు మోతలతో ప్రజలు చేస్తున్న ఆర్తనాదాలను తన కెమెరాలో షూట్ చేసి చేసి అలసిపోయినా 'అంతా బాగవుతుంది' అని ఆశావాద దృక్పథంతో సహచరుల్లో ధైర్యం నింపిన నా స్నేహితురాలు మరియం.

యుద్ధం వార్తలు కవర్ చేసేటప్పుడు మేమిద్దరం ఒకరొనొకరం చూసుకుంటూ ఉండేవాళ్లం. నేను వెళ్లిన చోటికి తను వచ్చేది. తను వెళ్లిన వెంటనే అక్కడికి నేను చేరుకునేదాన్ని. క్షేమంగానే ఉన్నామన్న సంకేతం అది.

'అంతా గడిచిపోతుంది..' అన్న ఆమె మాటలు నాకు ఇప్పటికీ గుర్తే. మరియం కొడుకు ఫైత్ చిరునవ్వులో తనని ఎప్పుడూ గుర్తుంచుకుంటాను. వాడు అమ్మలాగే అందంగా ఉంటాడు. కవరేజ్, టియర్ గ్యాస్, బుల్లెట్లు, బాంబు మోతల మధ్య దొరికిన అతి చిన్న సమయంలోనే మేము మా పిల్లల గురించి మాట్లాడుకునేవాళ్లం.

వాడు అక్కడ క్షేమంగా ఉంటాడు..

ఫైత్.. ఆమె ప్రపంచం. వాడి క్షేమం కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్న భర్త దగ్గరికి పంపేటప్పుడు తను ఎంతలా బాధపడిందో నాకు తెలుసు. 'వాడు అక్కడ సురక్షితంగా ఉంటాడు. సమయానికి తింటాడు. దాహం వేస్తే నీళ్లు తాగుతాడు. ఇక్కడ వినిపించే బాంబుల శబ్దం నా బిడ్డకి అసలు వినిపించవు. వాడు ఉన్న పరిస్థితి తలచుకుని ఇంత దుర్భర పరిస్థితిలో ఉన్నా ఆనందంగా ఉన్నాను' అని తను నాతో చెప్పింది.

అమ్మ మీద బెంగతో ఫైత్ ఏడ్చుకుంటూ ఫోన్ చేస్తే.. 'యుద్ధం త్వరలో ముగిసిపోతుంది. నేను నిన్ను కలుసుకుంటాను. ఏడవకు' అని చెప్పిన నా ఫ్రెండ్, యుద్ధం ముగిసి, కొడుకుని కలుసుకోవాలని ఎంతలా తపించిందో నాకు తెలుసు.

అది అబద్ధమైతే బాగుండు..

మరియం మరణవార్త విన్నప్పుడు నేను నమ్మలేదు. పదే పదే అక్కడివారికి ఫోన్ చేస్తూనే ఉన్నాను. ఆ వార్త అబద్ధమని చెబుతారని ఎంతో ఆశపడ్డాను. కానీ ఎవరూ ఆ మాట చెప్పలేదు. నేను రాసే కథనాలకు తన నుండి మెసేజ్ వస్తే బాగుండు అని ఎంతలా ఎదురుచూశానో.. ప్చ్ ఆ ఆశా నెరవేరలేదు. ఇప్పుడు నేను గాజాకి తిరిగివెళితే అక్కడ ఫీల్డ్‌లో నా స్నేహితురాలిని చూడకుండా ఎలా ఉండాలి. నా తోటి వారంతా బాంబు మోతలకు బలౌతున్న వార్తలు వింటుంటే నా గుండె బద్దలవుతోంది.

మరియం మరణించడానికి ముందు రోజు రాత్రి మార్చురీ దగ్గర న్యూస్ కవర్ చేసింది. ప్లాస్టిక్ బ్యాగుల్లో మృతదేహాలను భద్రపరచడం చూసి, 'ఒకవేళ తను చనిపోతే ప్లాస్టిక్ బ్యాగులో భద్రపరచవద్దని, ఏదైనా కవచం లాంటి దానిలో మూసివుంచమ'ని మార్చురీ సిబ్బందితో అన్న మాటలు నా సహచరులు చెప్పినప్పుడు నాకు దు:ఖం ఆగలేదు...

అమ్మ ఉత్తరం..

ఫైత్ కోసం అరబిక్‌లో మరియం రాసిపెట్టుకున్న ఉత్తరం తన మరణానంతరం లభ్యమైంది. అందులో రాసిన ప్రతి అక్షరం ఓ అమ్మ, కొడుకుపై పెట్టుకున్న ప్రేమకి చిహ్నం. ఆ ఉత్తరం చదువుతూ అల్జీరియా యుఎన్ రాయబారి అమర్ బెండ్‌జామ్ కన్నీళ్లు కార్చడం చూసి అక్కడ ఉన్న వారంతా భావోద్వేగమవ్వడం వార్తల్లో అందరూ చూశాం. అందులో ఏం ఉందంటే..

'ఫైతీ.. నువ్వే నా సర్వస్వం.. నువ్వు నా కోసం ప్రార్థన చెయ్యి. నేను చనిపోయిన తరువాత నా కోసం ఏడవొద్దు. నీ కలలను నెరవేర్చుకునేలా ఎదుగు. ప్రపంచమంతా తిరుగు. విదేశాల్లో చదువు. సంపన్నుడిగా మారు. ఎక్కడ తిరిగినా చివరికి నువ్వు నీ అమ్మ పుట్టిపెరిగిన ఈ దేశానికి రా! ఇక్కడ అమ్మ జ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రజల బాధల్లో, వారి కష్టాల్లో అమ్మ చెప్పిన కథలు ఉన్నాయి. నువ్వు పెద్ద వాడివి అయ్యాక, నీకు పెళ్లయి ఆడబిడ్డ పుడితే తనకి నా పేరు పెట్టు..' అని కొడుకుకి చివరిసారి ఉత్తరం రాసిన మరియం, చనిపోవడానికి రెండు గంటల ముందు కూడా తన న్యూస్ కవరేజ్‌ని ఎంతో ప్రభావవంతంగా ప్రపంచానికి చూపించింది.

గొప్ప సహాయకారి ఆమె

మరియం మరో స్నేహితురాలు, ఫీల్డ్‌లో తనతో పాటు పనిచేసిన రువైదా అమీర్ తన జ్ఞాపకాలను ఇలా చెబుతోంది. '2015లో మరియంని మొదటిసారి కలిశాను. ట్రైనింగ్ కోసం అబసాన్ నుండి తను ఇటాలియన్ సెంటర్‌కి వచ్చింది. తనది స్నేహహస్తమే కాదు, అంతకు మించిన సహాయకారి తను. యుద్ధం మొదలవ్వడానికి ముందు రోజు వరకు తను ఒక బిడ్డకి తల్లి అని నాకు తెలియదు. ఆ రోజు ఫైత్ తన దగ్గరికి వచ్చాడు. 'అమ్మా అమ్మా అని అల్లుకుపోయాడు. వాడ్ని ఎంత ప్రేమగా దగ్గరకి తీసుకుందో నాకు ఇప్పటికీ గుర్తే. వాడ్ని నాకు పరిచయం చేసింది. 'వీడే నా కొడుకు. పెద్దయ్యాక నన్ను రక్షిస్తాడు. వాడి కోసమే నేను ఈ కష్టమైన పని చేస్తున్నాను' అని చెప్పింది. 2024 మే నెలలో ఇజ్రాయిల్ రఫాపై దాడి చేసింది. యూరోపియన్ హాస్పిటల్ ఐసియులో ఆమె కనిపించింది. న్యూస్ కవరేజ్‌లో నేను పడుతున్న ఇబ్బందిని చూసి సహాయం చేసింది. ఆ రోజు తను చాలా అలసటగా కనిపించింది. అంతకు ముందెప్పుడూ నేను తనని అలా చూడలేదు. అక్కడి నుండి వెళ్లేటప్పుడు తనని జాగ్రత్తగా ఉండమని హెచ్చరించాను. అయితే ఆ తరువాత తను చాలా ప్రమాదకర వాతావరణం అయిన తూర్పు ప్రావిన్స్‌లో పనిచేస్తుందని తెలిసి చాలా భయపడ్డాను. మరియం హత్యకి గురైంది అక్కడే. ఆమె మరణవార్త వినగానే నాకు ఫైతే కళ్లల్లో మెదిలాడు.

అల్లు కనకరత్నమ్మ కన్నుమూత

అల్లు అరవింద్ తల్లి, కీర్తిశేషులు అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ (94) కన్నుమూశారు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. కనకరత్నమ్మ మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆమె మృతికి నివాళులు అర్పించారు. 'మా అత్తయ్య కనకరత్నమ్మ మృతి చెందడం ఎంతో బాధాకరం. మా కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, ధైర్యం, జీవిత విలువలు ఎప్పటికీ మాకు ఆదర్శం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను'. అని చిరంజీవి సంతాపం తెలిపారు.

'అత్తయ్య కనకరత్నమ్మ కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నాను. చెన్నైలో ఉన్నప్పటి నుంచి ఆమె మాపై ఎంతో ఆప్యాయత చూపేవారు. చుట్టూ ఉన్నవారిపై అమితమైన ప్రేమాభిమానాలు చూపేలా తన కుమార్తె సురేఖను తీర్చిదిద్దారు. అల్లు అరవింద్‌కు, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా'. అని పవన్ కల్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'ఘాటీ' సెన్సార్ పూర్తి

అనుష్క శెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ఘాటీ. భారీ అంచనాలతో సెప్టెంబర్ 5న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ఆకట్టుకుంటోంది. క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో అనుష్క వైవిధ్యమైన పాత్రలో నటించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించాయి. ఈ చిత్రానికి యు/ఎ సర్టిఫికెట్‌ను సెన్సార్‌బోర్డ్ జారీ చేసింది. ఈ మూవీ 2.37 గంటల నిడివితో ఉంది. ఏడుకు పైగా భారీ యాక్షన్‌సీన్లలో అనుష్క బాగా నటించినట్లుగా సమాచారం.

5 నుంచి 'ఆంఖో కి గుస్తాఖియాన్' స్ట్రీమింగ్

'ట్వెల్త్ ఫెయిల్' సినిమాతో ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్న విక్రాంత్ మాస్సే రికార్డ్ క్రియేట్ చేశారు. ఆ చిత్రం తర్వాత ఆయన నటించిన 'ఆంఖో కి గుస్తాఖియాన్' మూవీ ఓటీటీలోకి రానుంది. ప్రముఖ రచయిత రస్కిన్ బాండ్ రాసిన 'ది ఐస్ హేవ్ ఇట్' అనే కథ ఆధారంగా ఈ సినిమాను దర్శకుడు సంతోష్‌సింగ్ రూపొందించారు. బాక్సాఫీస్ వద్ద అనుకున్నంత రేంజ్‌లో మెప్పించ లేకపోయింది. జీ5 ద్వారా ఓటీటీలో సెప్టెంబర్ ఐదో తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతుందని చిత్ర యూనిట్ పోస్టర్‌ను విడుదల చేసింది. బాలీవుడ్ నటుడు సంజయ్ కపూర్ కుమార్తె శనయా కపూర్ కథానాయికగా తొలి పరిచయమైంది. శనయా థియేటర్ ఆర్టిస్ట్‌గా నటించగా.. విక్రాంత్ అంధ సంగీతకారుడి పాత్రలో మెప్పించారు. భావోద్వేగపూరితమైన వారి ప్రేమకథకు యూత్ బాగానే ఆకట్టుకుంది.

హీరోయిన్ల పోస్టర్లు ఎందుకు పెట్టరు?

'దక్షిణాది సినిమా పోస్టర్లలో హీరోలే ఉంటారు కానీ హీరోయిన్‌లు కనిపించర'ని ఓ కార్యక్రమంలో జ్యోతిక మాట్లాడారు. ఒక సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమె, 'బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి తమ సినిమాలకు సంబంధించిన పోస్టర్లలో తన ఫోటోను ఉంచారని, కానీ దక్షిణాదిలో మాత్రం హీరోయిన్‌ల ఫోటోలను పోస్టర్లపై పెట్టడానికి ఆసక్తి చూపర'ని అన్నారు. తాను నటించిన 'శైతాన్' హిందీ సినిమా పోస్టర్‌ను అజయ్ దేవగన్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, అలాగే మలయాళంలో మమ్ముట్టితో నటించిన 'కాథల్–ది కోర్' సినిమా పోస్టర్‌ను కూడా మమ్ముట్టి తన సోషల్ మీడియాలో పంచుకున్నారని జ్యోతిక గుర్తు చేశారు. దక్షిణాదిలో ఎంతోమంది స్టార్ హీరోలతో తాను పనిచేశానని ఏ ఒక్కరూ తమ సోషల్ మీడియాలో హీరోయిన్ల ఫోటోలను పోస్ట్ చేయడానికి ఆసక్తి చూపలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

విశాల్ పెళ్లి ఎప్పుడంటే ...

ధన్సికతో విశాల్ నిశ్చితార్థం ఇటీవల జరిగింది. ఆ కార్యక్రమం తరువాత విశాల్ మాట్లాడుతూ, పెళ్లిని ఇన్ని రోజులు వాయిదా వేసుకోవడానికి గల కారణాన్ని వివరించారు. 'మొదట ప్లాన్ చేసుకున్న ప్రకారం ఆగస్టు 29నే పెళ్లి జరగాల్సి ఉంది. అయితే 'నడిగర్ సంఘం' భవన నిర్మాణం కోసమే మేము పెళ్లికి తొమ్మిదేళ్లు ఆగాం. మరో 2 నెలల్లో అది పూర్తిగా సిద్ధమవుతుంది. మా పెళ్లి అందులోనే జరగనుంది. దీనికోసం ఇప్పటికే అందులో ఆడిటోరియం కూడా బుక్ చేసుకున్నాం. ఈ భవనం ప్రారంభోత్సవం జరిగిన వెంటనే మా వివాహ తేదీ నిర్ణయిస్తాం. ఇందులో జరిగే మొదటి పెళ్లి మాదే' అని తెలిపారు.

తెలుగు టైటాన్స్‌కు మళ్లీ నిరాశ

యుపి యోధాస్‌పై పోరాడినా ఓటమే..

ప్రొ కబడ్డీ సీజన్–12

విశాఖపట్నం: ప్రొ కబడ్డీ లీగ్(పికెఎల్) సీజన్–12లో తెలుగు టైటాన్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. తొలిరోజు తమిళ్ తలైవాస్ చేతిలో 3పాయింట్లతో ఓడిన టైటాన్స్.. శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో యుపి యోధాస్ చేతిలో 5పాయింట్ల తేడాతో ఓడింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 35–40పాయింట్ల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. చివరి 5నిమిషాల వ్యవధిలో పుంజుకొనేలా కనిపించినా.. అనవసర ట్యాకిల్‌తో ప్రత్యర్థి జట్టుకు 3పాయింట్లు సమర్పించుకొని చేజేతులా మరోసారి ఓడింది. కెప్టెన్ విజయ్ మాలిక్(14పాయింట్లు) సాధించగా.. భరత్(3), శుభమ్(2) ట్యాకిల్స్‌లో మెరిసారు. ఇక యుపి జట్టులో గగన్(14)రైడ్ పాయింట్లు సాధించగా.. గుమన్ సింగ్ 7 రైడ్ పాయింట్లు కొట్టాడు. యు ముంబ, గుజరాత్ జెయింట్స్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ 29–29పాయింట్లతో టై అయ్యింది. ఆ తర్వాత టై బ్రేకర్‌లో యు ముంబ జట్టు 6–5పాయింట్ల తేడాతో గుజరాత్‌ను చిత్తుచేసింది.

ప్రొ కబడ్డీలో నేడు..

తమిళ్ తలైవాస్ × యు ముంబ(రా.8.00గంIIలకు)

బెంగాల్ వారియర్స్ × హర్యానా స్టీలర్స్(రా.9.00గంIIలకు)

12బంతుల్లో 11సిక్సర్లు

కేరళ క్రికెట్ లీగ్‌లో సల్మాన్ రికార్డు

తిరువనంతపురం: కేరళ క్రికెట్ లీగ్‌లో సిక్సర్ల మోత మోగింది. కాలికట్ గ్లోబల్ స్టార్స్ కెప్టెన్ సల్మన్ నిజర్ 12 బంతుల్లో 11 సిక్సర్లతో సహా ఓవర్‌లో 40 పరుగులు చేసి రికార్డు నెలకొల్పాడు. ఇందులో ఆరు సిక్సర్లతో సహా వైడ్ రూపంలో మరో 4పరుగులు వచ్చాయి. అదాని త్రివేండ్రంతో శనివారం జరిగిన మ్యాచ్‌ను కాలికట్ జట్టు తరపున సల్మన్ ఈ ఫీట్ నెలకొల్పాడు. నిజర్ కేవలం 26బంతుల్లో 86పరుగులతో రాణించాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కాలికట్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 186పరుగులు చేయగా.. ఛేదనలో అదానీ త్రివేండ్రం జట్టు 19.3ఓవర్లలో 173పరుగులకే ఆలౌట్ అయ్యింది.

అరగంట ఆలస్యంగా ఆసియాకప్ టోర్నీ

రీ షెడ్యూల్‌ను ప్రకటించిన నిర్వాహకులు

దుబాయ్: ఆసియా కప్ క్రికెట్ టోర్నీ జరిగే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో ఎండల తీవ్రత అధికంగా ఉంది. దీంతో టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. లీగ్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ ఫైట్ సమయంలోనూ మార్పులు చేశారు. సెప్టెంబర్ నెల ప్రారంభం నుంచి పగటిపూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని, సాయంత్రం 6గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగనుందని స్థానిక వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో షెడ్యూల్ ప్రకారం ప్రకటించిన 6.00గంటల మ్యాచ్‌లన్నీ 6:30 గంటల నుంచి (భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలు)లకు డై–నైట్ మ్యాచ్‌లు మొదలవుతాయి. ఇదే విషయాన్ని బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ అయిన సోనీ స్పోర్ట్స్‌కు తెలియజేశారు నిర్వాహకులు. అయితే.. ఒకే ఒక మ్యాచ్ సమయం మాత్రం మారలేదు. సెప్టెంబర్ 15న ఆతిథ్య యుఎఇ, ఒమన్ జట్లు పగటిపూటనే అబుదాబీలోని జయెద్ క్రికెట్ స్టేడియంలో తలపడనున్నాయి. సెప్టెంబర్ 9న అఫ్గనిస్థాన్, హాంకాంగ్ మధ్య ఆరంభ పోరు జరుగనుంది. మరుసటి రోజు భారత జట్టు, ఆతిథ్య యుఎఇని ఢీకొట్టనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68